


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 9 సంచిక : 363 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : కాకినాడ | బుధవారం 2 సెప్టెంబర్ 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :9 ISSUE :363 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : KAKINADA | WED 2 SEPTEMBER 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur



## హైకోర్టులో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు భారీ ఊరట

- శాంతా శ్రీరామ్ కన్ స్ట్రక్షన్స్ కేసులో రంగనాథ్‌ను కమిషనర్‌గా తొలగించాలన్న సింగిల్ బెంచ్
- సింగిల్ బెంచ్ ఉత్తర్వులను సవాల్ చేసిన రంగనాథ్
- విచారణ చేపట్టి, సింగిల్ బెంచ్ ఉత్తర్వులను సస్పెండ్ చేసిన హైకోర్టు డివిజన్ బెంచ్

**పెన్ పవర్ డెస్క్:**హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కు తెలంగాణ హైకోర్టులో భారీ ఊరట లభించింది. రంగనాథ్‌ను కమిషనర్ బాధ్యతల నుంచి తప్పించాలంటూ సింగిల్ జడ్జి

- మిగతా 2లో

## సింధు జలాల వివాదం.. నీటిని ఆయుధంగా వాడొద్దన్న పాకిస్థాన్ ప్రధాని

- ఎస్‌సీఓ సదస్సులో సింధు జలాల ఒప్పందంపై పాక్ ప్రధాని ప్రస్తావన
- నీటిని రాజకీయ ఆయుధంగా వాడరాదని షెహబాజ్ షరీఫ్ వ్యాఖ్య
- హేగ్ మధ్యవర్తిత్వ కోర్టు తీర్పును తీవ్రంగా వ్యతిరేకించిన భారత్
- పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత ఒప్పందాన్ని నిలిపివేసినట్లు స్పష్టం చేసిన ఇండియా

- మిగతా 2లో



## స్థానిక సంస్థల ఎన్నికలను ఛాలెంజ్‌గా తీసుకోవాలి

- ప్రతి స్థానంలో పోటీకి సిద్ధం కావాలి.
- ఏకగ్రీవాలకు అవకాశం ఇవ్వకుండా కార్యాచరణ రూపొందించాలి.
- అధికార బలం, పోలీసుల ఒత్తిళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలి.
- కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని జగన్ భరోసా.
- వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన మేలును ప్రతి ఇంటికీ వివరించాలి.
- కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలి.
- ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడాలి.
- గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలి.



**పెన్ పవర్ డెస్క్:**స్థానిక సంస్థల ఎన్నికలను ఛాలెంజ్‌గా తీసుకుని ప్రతి స్థానంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు పోటీ చేసేలా ఇప్పటి నుంచే సిద్ధం కావాలని ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

- మిగతా 2లో



## పాక్ దుర్బుద్ధి.. మోదీ లేకుండా ఎస్‌సీఓ గ్రూప్ ఫొటో

- గ్రూప్ ఫొటో నుంచి మోదీని పాక్ తొలగించింది
- రౌండ్‌టేబుల్ వీడియోలోనూ మోదీ భాగాన్ని ఎడిట్ చేసింది
- పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఖాతాల్లో ఫొటో, వీడియో షేర్
- మోదీ మాత్రం పూర్తి గ్రూప్ ఫొటోను షేర్ చేశారు
- ఉగ్రవాదం వ్యూహాత్మక సంపద కారాదని మోదీ స్పష్టం చేశారు
- పాక్ చర్యలపై నెటిజన్ల విమర్శలు

- మిగతా 2లో



## ఉత్తరాంధ్ర చరిత్రలో అపురూప ఘట్టం..

### నేడు పాయకరావుపేటలో గోదావరి జలాలకు సీఎం చంద్రబాబు జల హారతి

- పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి జిల్లాకు గోదావరి జలాలు
- నేడు పాయకరావుపేటలో జలాలకు హారతి ఇచ్చి విడుదల చేయనున్న సీఎం చంద్రబాబు
- 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 5.23 లక్షల మందికి తాగునీరు అందించే లక్ష్యం
- నాలుగు నదులు, తూర్పు కనుమలు దాటుతూ సాగిన కాలువ నిర్మాణం
- భవిష్యత్తులో ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి అనుసంధానం చేసి 8 లక్షల ఎకరాలకు నీరు

- మిగతా 2లో

## బటన్ నొక్కడం కాదు..

## ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు ఇస్తున్నాం

- మొగల్తూరులో చంద్రబాబు సభ
- పేదల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని వెల్లడి
- మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ, డ్వాక్రా సంఘాలకు ప్రోత్సాహం అందిస్తామని హామీ
- నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయడమే తన ఆశయమని స్పష్టీకరణ
- పెట్టుబడులను ఆకర్షించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని భరోసా



**పెన్ పవర్ డెస్క్:**"గత పాలకులు బటన్ నొక్కి చేతులు దులుపుకొన్నారు, రోడ్ల నిండా గుంతలు పెట్టారు. కానీ మేం అలా కాదు.. ప్రతి అవ్వాతాత ఇంటికి వచ్చి వారికి గౌరవంగా పెన్షన్ అందిస్తున్నాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పేదల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అనే మూడు సూత్రాలతో ముందుకు సాగుతోందని ఆయన పునరుద్ఘాటించారు. పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం నియోజకవర్గంలోని మొగల్తూరులో మంగళవారం నిర్వహించిన 'పేదల సేవలో ప్రజా వేదిక' కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీని ఆయన ప్రారంభించి ప్రసంగించారు.

గత ప్రభుత్వ హయాంలో పెన్షన్ల కోసం వృద్ధులు, దివ్యాంగులు గంటల తరబడి క్యూలైన్లలో నిలబడాల్సిన దుస్థితి ఉండేదని, తమ ప్రభుత్వం ఆ విధానానికి స్వస్తి పలికిందని చంద్రబాబు అన్నారు. వాలంటీర్ వ్యవస్థను దుర్వినియోగం చేసిన గత పాలకుల తీరును ఆయన తప్పుబట్టారు. ఇప్పుడు తాము నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి, పెంచిన పెన్షన్లను అందిస్తూ వారి ఆత్మగౌరవాన్ని నిలబెడుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా తన రాజకీయ ప్రస్థానాన్ని గుర్తుచేసుకున్న చంద్రబాబు, 31 ఏళ్ల క్రితం ఇదే రోజు (సెప్టెంబరు 1) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తొలిసారి ప్రమాణస్వీకారం చేశానని, అప్పటి నుంచి ప్రజా చైతన్యం, ప్రజా భాగస్వామ్యమే ధ్యేయంగా పనిచేస్తున్నానని తెలిపారు. ఇప్పటివరకు పెన్షన్ల రూపంలో రూ.73,507 కోట్లు అందించామని, గత రెండేళ్లలో సంక్షేమ పథకాల

- మిగతా 2లో

## విజయసాయిరెడ్డిని సజ్జల కొట్టింది నిజమే

**పెన్ పవర్ డెస్క్:**'దేశవిదేశాల నుంచి ఆంధ్రులు వచ్చి ఓట్లు వేసి కూటమిని గెలిపించారు. కూటమి ప్రభుత్వ ఘనవిజయం ఒకచరిత్ర.. వైకాపా ఘోర పరాజయం కూడా చారిత్రకఘట్టం' అని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మీడియా మాట్లాడుతూ.. కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతూ వైకాపా వికృత రాజకీయం చేస్తుందన్నారు. హిందూ మతానికి ఘోర

- మిగతా 2లో



## అక్షర ఆంధ్రకు అద్భుత ఫలితాలు..

### వచ్చే సెప్టెంబరుకు 100 శాతం అక్షరాస్యత:

- పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్య శాఖలపై మంత్రి నారా లోకేశ్ సమీక్ష
- వచ్చే ఏడాది సెప్టెంబర్ నాటికి సంపూర్ణ అక్షరాస్యత సాధనకు పక్కా ప్రణాళికలు
- అక్షర ఆంధ్ర కార్యక్రమంతో ఏడాదిలో 25 లక్షల మందికి అక్షరజ్ఞానం
- బడిబయట ఉన్న 1.64 లక్షల మంది పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని ఆదేశం
- మధ్యాహ్న భోజనంపై ఫీడ్‌బ్యాక్ ఇవ్వాలని తల్లిదండ్రులకు, టీచర్లకు సూచన
- ఇంటర్ విద్యార్థులకు 'తల్లికి వందనం' కింద రూ.1051 కోట్ల ఆర్థిక సాయం

- మిగతా 2లో



## రైతు ఇంటికి సీఎం విజయ్.. బామ్మకు సర్‌ప్రైజ్ గిఫ్ట్

- సేలం జిల్లాలో తమిళనాడు సీఎం విజయ్ పర్యటన
- రైతు ఇంట్లో ఆకస్మికంగా ఆగిన ముఖ్యమంత్రి
- సీఎంను చూసి ఆనందంతో ఉబ్బితబ్బిబ్బైన బామ్మ
- తన కళ్లజోడును బామ్మకు బహుమతిగా ఇచ్చిన విజయ్

**పెన్ పవర్ డెస్క్:**తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తన పర్యటనలో ఒక రైతు కుటుంబానికి అనూహ్య రీతిలో ఆశ్చర్యాన్ని కలిగించారు. మంగళవారం సేలం జిల్లాలో పర్యటించిన ఆయన, ఒక గ్రామంలో ఆకస్మికంగా

- మిగతా 2లో



## ల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ అమలుకు లైన్ క్లియర్..

- కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై స్టే ఎత్తివేసిన హైకోర్టు
- తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలంగా డివిజన్ బెంచ్ తీర్పు
- సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను రద్దు చేసిన ధర్మాసనం
- ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాల్లో జోక్యంపై కీలక వాదనలు
- పథకాల అమలుకు తొలగిన అడ్డంకులు

- మిగతా 2లో




## 1,000 దాటిన మరణాలు.. 700 మృతదేహాలు సామూహిక ఖననం

**పెన్ పవర్ డెస్క్:**నేపాల్ వరదల్లో గల్లంతైన వారి కోసం ఆరో రోజూ సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఇప్పటివ రకు 1003 మృతదే హాలను సహాయక బృందాలు వెలికితీశాయి. సుమారు 4వేల మంది ఆచూకీ ఇంకా లభించలేదు.

- మిగతా 2లో



# బటన్ నొక్కడం కాదు..
# ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు ఇస్తున్నాం

- మొదటి పేజి తరువాయి
కోసం రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేశామని వివరించారు.

మహిళా సాధికారత నుంచి సామాజిక న్యాయం వరకు

మహిళా సాధికారతకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చంద్రబాబు అన్నారు. పొదుపు ఉద్యమానికి శ్రీకారం చుట్టిన డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలను ఆర్థికంగా నిలబెట్టామని, ఇప్పుడు 'దీపం-2.0' పథకం ద్వారా ప్రతి పేద కుటుంబానికి ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని తెలిపారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించి వారిని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుతున్నామని చెప్పారు. గత ఏడాది లక్ష మంది డ్వాక్రా మహిళలు ఎంఎస్ఎంఈలుగా ఎదిగారని, ఈ లక్ష్యాన్ని మరింత పెంచుతామని, వారు తయారు చేసే ఉత్పత్తులకు 'స్వయం' బ్రాండ్‌తో మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అలాగే 'స్త్రీశక్తి' కార్యక్రమం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించి వారిపై ఆర్థిక భారం తగ్గించామని అన్నారు.

సంక్షేమం అంటే కేవలం డబ్బులు పంచడం కాదని, అన్ని వర్గాల ప్రజలను అభివృద్ధిలోకి తీసుకురావడమేనని సీఎం పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల్లో ఇంకా ఉన్న వెనుకబాటుతనాన్ని రూపుమాపేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా వడ్డెర్లకు మైనింగ్‌లో, గీత కార్మికులకు మద్యం దుకాణాల్లో రిజర్వేషన్లు కల్పించామని, మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణను అమలు చేసి సామాజిక న్యాయం చేశామని గుర్తుచేశారు.

**అభివృద్ధి, సాంకేతికతతో నవశకం**

నదుల అనుసంధానంతో రాష్ట్రంలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కరవు నేలకు కృష్ణా జలాలు అందించామని, శ్రీశైలం నుంచి మార్కాపురం వరకు నీళ్లు పారించడం తన జీవితంలో ఎనలేని ఆనందాన్ని ఇచ్చిందన్నారు. రేపు గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తరలించబోతున్నామని, గోదావరి నీటిని అనకాపల్లి, విశాఖ మీదుగా వంశధార వరకు తీసుకెళ్తామని ప్రకటించారు.

గత పాలకులు పరిశ్రమలను తరిమేసి యువత భవిష్యత్తును అంధకారం చేశారని విమర్శించారు.

తమ ప్రభుత్వం పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షిస్తోందని, విద్యుత్ సంస్థలను సమర్థంగా నిర్వహిస్తూ 'ట్రూ డౌన్' ద్వారా ఛార్జీల భారాన్ని తగ్గించామని తెలిపారు. ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్‌ను కేవలం రూ.1.5కే అందిస్తున్నామని, ప్రపంచ మార్కెట్లో ఏపీ ఆక్వా ఉత్పత్తులను అగ్రస్థానంలో నిలుపుతామని అన్నారు. ప్రజా పాలనలో సాంకేతికతను విరివిగా ఉపయోగిస్తామని, ఏఐ ట్యూటర్, ఏఐ డాక్టర్ వంటి వ్యవస్థలను ప్రజలకు అందుబాటులోకి తెస్తామని, 1.60 కోట్ల కుటుంబాలకు ఆన్‌లైన్‌లోనే ప్రభుత్వ సేవలు అందించే వ్యవస్థను రూపొందిస్తామని వెల్లడించారు. నర్సాపురం అభివృద్ధికి ఆక్వా కల్చర్ యూనివర్సిటీ, డంప్ యార్డు, డెల్టా ఆధునికీకరణ పనులు చేపడతామని హామీ ఇచ్చారు.

**ఏకగ్రీవాలు వద్దనడం వారి ఓటమి భయానికి నిదర్శనం**

రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఎన్డీఏ కూటమిదే విజయమని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. ఓటమి భయంతోనే 'గొడ్డలి పార్టీ' స్థానిక సంస్థల ఎన్నికలు జరగకుండా అడ్డుకునేందుకు కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఏకగ్రీవాలను వద్దనడం వారి ఓటమి భయానికి నిదర్శనమని, గతంలో ప్రభుత్వాలే ఏకగ్రీవాలను ప్రోత్సహించాయని గుర్తుచేశారు. ఆయారాం-గయారాంలను అరికట్టేందుకు మేయర్, చైర్మన్ ఎన్నికలను ప్రత్యక్ష పద్ధతిలో పెట్టామని తెలిపారు. బీసీ రిజర్వేషన్లను కూడా తగ్గించి ఆ వర్గాలకు అన్యాయం చేశారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్, ఉపసభాపతి రఘురామ కృష్ణంరాజు, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, విప్ బొలిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎడిటర్ వ్యూ

### సింధు జలాల వివాదం.. నీటిని ఆయుధంగా వాడొద్దన్న పాకిస్థాన్ ప్రధాని

షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సు వేదికగా భారత్-పాకిస్థాన్ మధ్య సింధు జలాల ఒప్పందం వివాదం మరోసారి చర్చనీయాంశమైంది. మంగళవారం ఈ అంశాన్ని ప్రస్తావించిన పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, నీటిని ఎట్టి పరిస్థితుల్లోనూ రాజకీయ అస్త్రంగా మలుచుకోకూడదని భారత్‌ను ఉద్దేశించి పరోక్ష వ్యాఖ్యలు చేశారు. అంతర్జాతీయ ఒప్పందాలను వాటి అసలు స్ఫూర్తికి అనుగుణంగా అమలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. హేగ్‌లోని శాశ్వత మధ్యవర్తిత్వ న్యాయస్థానం సింధు జలాల ఒప్పందం చెల్లుబాటును సమర్థిస్తూ, వివాద పరిష్కార యంత్రాంగం కొనసాగుతుందని తీర్పు వెలువరించిన మరుసటి రోజే షెహబాజ్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే, ఈ న్యాయస్థానం తీర్పును భారత్ తీవ్రంగా వ్యతిరేకించింది. అసలు, ఆ కోర్టు ఏర్పాటే చట్టవిరుద్ధమని, దాని పరిధిని తాము గుర్తించబోమని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇప్పటికే స్పష్టం చేసింది. సదరు ట్రైబ్యునల్ విచారణలో భారత్ పాల్గొనలేదని, ఆ తీర్పులు తమ జలవిద్యుత్ ప్రాజెక్టులపై ఎలాంటి ప్రభావం చూపబోవని తేల్చిచెప్పింది. 2025 ఏప్రిల్‌లో జరిగిన పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో సింధు జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసింది. తాజా తీర్పు వెలువడినప్పటికీ, ఈ విషయంలో తన వైఖరిలో ఎలాంటి మార్పు లేదని భారత్ పునరుద్ఘాటించింది. ఇదే ఎస్‌సీఓ సదస్సులో ప్రసంగించిన భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఉగ్రవాదంపై పోరాటంలో ద్వంద్వ ప్రమాణాలు పాటించడం తగదని హెచ్చరించారు. ఉగ్రవాదానికి అందుతున్న నిధులు, నియామకాలు, సురక్షిత స్థావరాలను కూకటివేళ్లతో పెకిలించాలని పిలుపునిచ్చారు. ఈ పరిణామాలతో భారత్-పాకిస్థాన్ మధ్య ఇప్పటికే నెలకొన్న ఉద్రిక్తతల మధ్య సింధు జలాల వివాదం మరోసారి కీలక అంశంగా మారింది.

## హైకోర్టులో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు భారీ ఊరట

- మొదటి పేజి తరువాయి
ఇచ్చిన తీర్పును హైకోర్టు డివిజన్ బెంచ్ రద్దు చేసింది. అనంతరం ఈ కేసు తదుపరి విచారణను నవంబర్ 3వ తేదీకి వాయిదా వేసింది. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, లోతుకుంట గ్రామంలోని సర్వే నెంబర్లు 1, 2లలో ఉన్న సుమారు 40 ఎకరాల భూమిలో ఈ నెల 17న అధికారులు కూల్చివేతలు చేపట్టారు. ఈ చర్యను సవాలు చేస్తూ శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా గతంలో సింగిల్ జడ్జి తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

కోర్టు ఆదేశాలను పదేపదే ఉల్లంఘించే అధికారులు చట్టబద్ధమైన పాలనకు ప్రమాదకరమని, అలాంటి వ్యక్తులు బాధ్యతాయుతమైన పదవుల్లో కొనసాగకూడదని సింగిల్ జడ్జి అభిప్రాయపడ్డారు. గత ఐదేళ్లలో 9,290 కోర్టు ధిక్కరణ కేసులు పెండింగ్‌లో ఉండగా, కేవలం ఏడాదిన్నర కాలంలోనే ఒక్క రంగనాథ్‌పైనే 63 కేసులు నమోదు కావడం అసాధారణమని కోర్టు పేర్కొంది. ఈ నేపథ్యంలోనే ఆయనను హైడ్రా కమిషనర్ పదవి నుంచి తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. అయితే, సింగిల్ జడ్జి ఇచ్చిన ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ రంగనాథ్ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, తాజాగా డివిజన్ బెంచ్ ఆ తీర్పును రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది.

## స్థానిక సంస్థల ఎన్నికలను ఛాలెంజ్‌గా తీసుకోవాలి

- మొదటి పేజి తరువాయి
ఎక్కడా ఏకగ్రీవాలకు అవకాశం ఇవ్వకుండా గ్రామాలు, వార్డుల వారీగా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. పులివెందుల పర్యటనలో భాగంగా భాకరాపురం క్యాంప్ కార్యాలయంలో వైఎస్ జగన్ ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలు, వినతులను ఆయన ఓపికగా విన్నారు. అనంతరం పార్టీ నాయకులతో మాట్లాడి స్థానిక సంస్థల ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు. అధికార బలం, పోలీసులను అడ్డుపెట్టుకుని ఒత్తిళ్లు, దౌర్జన్యాలకు పాల్పడితే ధైర్యంగా, సంఘటితంగా ఎదుర్కోవాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రజలకు జరిగిన మేలును ప్రతి ఇంటికీ వివరించాలని జగన్ సూచించారు. గ్రామ సచివాలయాలు, వాలంటీర్ వ్యవస్థ, నాడు--నేడు, ఆరోగ్యశ్రీ, రైతులు, మహిళలు, విద్యార్థులు, పేదలకు అందించిన సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. అదేవిధంగా కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యలపై నిరంతరం పోరాడాలని పార్టీ శ్రేణులకు సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలను విజయవంతంగా ఎదుర్కొనేందుకు గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసి నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

## విజయసాయిరెడ్డిని సజ్జల కొట్టింది నిజమే

- మొదటి పేజి తరువాయి
అన్యాయం జరిగిందని ఎలా మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. ఆలయాల్లో రథాలు తగులబడినప్పుడు, విగ్రహాల తలలు తెగ్గొట్టినప్పుడు, సింహాలు చోరీకి గురైనప్పుడు వైకాపా నేతల నోళ్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఏపీని అస్థిరం చేయాలని ఓ భయానక వాతావరణం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. పరిశ్రమలు, పెట్టుబడులు రాకూడదని ఫేక్ వీడియోలతో ప్రచారాలు చేస్తే.. చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. వైకాపా క్రెడిట్ చోరీ చూస్తుంటే నాగార్జునసాగర్, సోమశిల, తెలుగుగంగ ప్రాజెక్టులు కట్టింది జగన్ అని చెప్పేట్టు ఉన్నారని ఎద్దేవా చేశారు. "విజయసాయిరెడ్డి నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసినప్పుడు ఎంత నీచంగా, ఘోరంగా మాట్లాడారో అందరికీ తెలుసు. విజయసాయిని సజ్జల కొట్టింది నిజమే. మంగళగిరిలో ప్లీనరీ జరిగేటప్పుడు వేదికపై ఎవరితో మాట్లాడించాలనే దానిపై ఇద్దరి మధ్య వివాదం తలెత్తి, మాటామాటా పెరిగి కొట్టింది వాస్తవమే. విజయసాయిరెడ్డి 72 అవమానాలు జరిగాయని చెప్పారు. నాకు ఒక్కడికే తెలిసి మరో ఘోర అవమానం జరిగింది. తన సొంతూరైన తాళ్లపూడికి వచ్చినప్పుడు.. కాకుపల్లి సెంటర్‌లో వంద వాహనాలతో ఘనంగా స్వాగతం పలికారు. దానిపై విజయసాయిని సజ్జల నీచాతినీచంగా దూషించారు. ఆ మాటలు నా నోటితో నేను చెప్పలేను" అని కోటంరెడ్డి అన్నారు.

## రైతు ఇంటికి సీఎం విజయ్.. బామ్మకు సర్‌ప్రైజ్ గిఫ్ట్

- మొదటి పేజి తరువాయి
ఆగి స్థానిక ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఒక వృద్ధురాలు చూపిన ఆత్మీయతకు ముగ్ధుడైన ఆయన, తాను ధరించిన కళ్లజోడును ఆమెకు బహుమతిగా అందించి అందరినీ ఆశ్చర్యపరిచారు. సేలం జిల్లాలోని మెట్టూరు డ్యామ్ గేట్లను తెరిచి, సాగునీటిని విడుదల చేసే క్రమంలో ముఖ్యమంత్రి విజయ్ అక్కడికి చేరుకున్నారు. కార్యక్రమం ముగించుకుని చెన్నైకి తిరుగుప్రయాణమైన ఆయన, మార్గమధ్యలోని చిన్నకావూరు గ్రామం వద్ద తన కాన్వాయ్‌ను నిలిపివేశారు. నేరుగా రామస్వామి అనే రైతు నివాసానికి వెళ్లి ఆ కుటుంబ సభ్యులను పలకరించారు. ముఖ్యమంత్రి స్వయంగా తమ ఇంటికి రావడంతో ఆ కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హర్షాతిరేకలు వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఒక వృద్ధురాలు ముఖ్యమంత్రిని చూడగానే అమితానందానికి లోనయ్యారు. ఆత్మీయంగా ఆయన్ను ఆలింగనం చేసుకుని, చేతిని గట్టిగా పట్టుకుని తన అనురాగాన్ని చాటుకున్నారు. అనంతరం తన పెరట్లోని తోటను ఆయనకు చూపించారు. ఆమె అభిమానానికి చలించిన విజయ్, తక్షణమే తాను ధరించిన కళ్లజోడును తీసి ఆమెకు బహుమతిగా ఇచ్చారు. ఆ తర్వాత గ్రామంలోని వృద్ధులకు చీరలు, పంచెలు పంపిణీ చేసి అక్కడి నుంచి నిష్క్రమించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కాగా, విజయ్ ఆ బామ్మకు బహూకరించిన సన్ గ్లాసులు వరల్డ్ క్లాస్ సంస్థ 'క్రిస్టియన్ డయోర్' తయారు చేసినవి. వీటి ధర రూ.50 వేలకు పైనే ఉంటుంది.

## ఉత్తరాంధ్ర చరిత్రలో అపురూప ఘట్టం..నేడు పాయకరావుపేటలో
## గోదావరి జలాలకు సీఎం చంద్రబాబు జల హారతి

ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల సాగునీటి కలను సాకారం చేస్తూ గోదారమ్మ ఆ ప్రాంతంలోకి అడుగుపెడుతోంది. పోలవరం ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ ద్వారా గోదావరి జలాలు అనకాపల్లి జిల్లా వరకు పరుగులు పెడుతున్నాయి. నాలుగు నదులను, తూర్పు కనుమల కొండలను దాటుకుని వస్తున్న ఈ జలధార, ఉత్తరాంధ్ర బీడు భూములను సస్యశ్యామలం చేసేందుకు సిద్ధమైంది. ఈ చారిత్రక ఘట్టానికి గుర్తుగా, ముఖ్యమంత్రి చంద్రబాబు (సెప్టెంబరు 2) అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో గోదావరి జలాలకు 'జల హారతి' ఇచ్చి లాంఛనంగా విడుదల చేయనున్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఈ ఏడాదిలోనే అనకాపల్లికి నీళ్లు అందించి, కూటమి ప్రభుత్వం తన సంకల్పాన్ని నిలబెట్టుకుంది.

మంగళవారం మధ్యాహ్నం 2:20 గంటలకు పాయకరావుపేటకు చేరుకోనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, కాలువపై నిర్మించిన రెగ్యులేటర్‌ను ప్రారంభించి నీటిని విడుదల చేస్తారు. అనంతరం ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఈ కార్యక్రమంతో ఉత్తరాంధ్ర సాగునీటి చరిత్రలో ఒక నూతన అధ్యాయం ప్రారంభం కానుంది.

**కొండలు, నదులు దాటిన ఇంజనీరింగ్ అద్భుతం**

గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తరలించడం అనేది ఒక గొప్ప ఇంజనీరింగ్ అద్భుతం. ఈ ప్రయాణంలో పంపా, తాండవ, వరాహ, శారద వంటి నాలుగు నదులను, ఏలేరు కాలువను, తూర్పు కనుమలను దాటాల్సి వచ్చింది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.4,192 కోట్లు వెచ్చించి అధునాతన సాంకేతికతతో నిర్మాణాలు చేపట్టింది. కొన్నిచోట్ల నదుల ప్రవాహానికి ఎగువన అక్విడెక్టులు, మరికొన్ని చోట్ల ప్రవాహానికి దిగువన సైఫన్లు నిర్మించారు. ముఖ్యంగా ఏలేరు నది గర్భం కింద నుంచి గోదావరి నీటిని తరలించేందుకు సైఫన్‌ను, పంపా నదిపై 30 మీటర్ల లోతు పునాదులతో భారీ అక్విడెక్టును నిర్మించారు. 10,634 క్యూసెక్కుల నీటి ప్రవాహాన్ని తట్టుకునేలా తాండవ నదిపై 447 మీటర్ల పొడవున అక్విడెక్టు నిర్మాణం చేపట్టడం ఈ ప్రాజెక్టు సంక్లిష్టతకు నిదర్శనం.

**లక్షల ఎకరాలకు భరోసా.. భవిష్యత్తుకు మార్గం**

ప్రస్తుతం విడుదల చేస్తున్న నీటితో నాలుగు జిల్లాల పరిధిలో 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 5.23 లక్షల మందికి తాగునీరు అందనుంది. ఒక్క అనకాపల్లి జిల్లాలోనే 1.50 లక్షల ఎకరాల ఆయకట్టుకు ప్రయోజనం కలగనుంది. దీంతోపాటు జిల్లాలోని 110 చెరువులను నింపేందుకు జలవనరుల శాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. పుష్కర ఆయకట్టు కింద 1.48 లక్షల ఎకరాలు, ఏలేరు కింద 80 వేల ఎకరాలు, పంపా, తాండవ, వరాహ తదితర ఆయకట్టుల కింద మరో 58,000 ఎకరాలకు పైగా భూమి స్థిరీకరణ జరగనుంది.

వచ్చే ఏడాది నాటికి ఈ జలాలను విశాఖపట్నం వరకు పొడిగించి, ఆపై ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి అనుసంధానించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. 213 కిలోమీటర్ల పొడవైన ఈ ఎడమ కాలువ ద్వారా మొత్తం 23.44 టీఎంసీల నీటిని వినియోగంలోకి తెస్తారు. ఈ బృహత్తర ప్రణాళిక పూర్తయితే అనకాపల్లి, విశాఖ, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లోని మెట్ట ప్రాంతాలతో సహా మొత్తం 8 లక్షల ఎకరాలకు సాగు, తాగునీరు అంది, ఉత్తరాంధ్ర స్వరూపమే మారిపోనుంది.

## కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ అమలుకు లైన్ క్లియర్..

తెలంగాణలో అమలవుతున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఈ పథకాల అమలును నిలిపివేస్తూ గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర స్టే ఉత్తర్వులను ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని డివిజన్ బెంచ్ మంగళవారం రద్దు చేసింది. దీంతో ఈ పథకాల కొనసాగింపునకు మార్గం సుగమమైంది. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు సంబంధించి 2014 నుంచి ప్రభుత్వం జారీ చేసిన ఎనిమిది జీవోలను సవాలు చేస్తూ విజయ్ గోపాల్ అనే న్యాయవాది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రభుత్వం కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయకపోవడంతో, విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి పథకాల అమలుపై మధ్యంతర స్టే విధించారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ (ఏజీ) సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ, ఈ పథకాలు 2014 నుంచి నిరంతరాయంగా అమలవుతున్నాయని, పిటిషనర్ లబ్ధిదారుడు కానందున ఆయనకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని కోర్టుకు తెలిపారు. ఇది ప్రజాప్రయోజన వ్యాజ్యం కాదని, ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలపై దాఖలైన ఇలాంటి వ్యాజ్యాలను డివిజన్ బెంచ్ మాత్రమే విచారించాలని వాదించారు. షాదీ ముబారక్ వంటి పథకాలకు సుప్రీంకోర్టు కూడా గతంలో అనుమతినిచ్చిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అడ్వకేట్ జనరల్ వాదనలతో ఏకీభవించిన డివిజన్ బెంచ్, సింగిల్ జడ్జి ఇచ్చిన స్టే ఉత్తర్వులను ఎత్తివేస్తూ తీర్పునిచ్చింది. హైకోర్టు తాజా నిర్ణయంతో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలు రాష్ట్రవ్యాప్తంగా యథావిధిగా కొనసాగనుంది.

## పాక్ దుర్బుద్ధి.. మోదీ లేకుండా ఎస్‌సీఓ గ్రూప్ ఫొటో

షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సదస్సు సందర్భంగా పాకిస్థాన్ మరోసారి వివాదాస్పదంగా వ్యవహరించింది. కిర్గిస్థాన్‌లో జరిగిన సదస్సులో పాల్గొన్న 10 సభ్య దేశాల నాయకులు కలిసి దిగిన గ్రూప్ ఫొటోను పాక్ ప్రధాని కార్యాలయం ఎక్స్‌లో షేర్ చేసింది. అయితే ఆ ఫొటో నుంచి భారత ప్రధాని నరేంద్ర మోదీతో పాటు మరికొందరు నేతలను క్రాప్ చేసి తొలగించింది. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మాత్రం దేశాధినేతల మధ్యలో ఉన్నట్లు ఫొటోలో కనిపించారు. అంతేకాకుండా ఎస్‌సీఓ నాయకుల రౌండ్‌టేబుల్ సమావేశానికి సంబంధించిన వీడియోలోనూ మోదీ కనిపించే భాగాన్ని పాక్ ఎడిట్ చేసి తొలగించింది. మోదీ లేని ఆ వీడియోను షెహబాజ్ షరీఫ్ తన అధికారిక ఫేస్‌బుక్ ఖాతాలో షేర్ చేశారు. మరోవైపు ప్రధాని మోదీ మాత్రం సదస్సుకు హాజరైన అన్ని దేశాల అధినేతలు ఉన్న పూర్తి గ్రూప్ ఫొటోను తన అధికారిక ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. అందులో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కూడా ఉన్నారు. దీంతో పాకిస్థాన్ తీరుపై నెటిజన్లు విమర్శలు చేస్తున్నారు. సదస్సులో ప్రధాని మోదీ పాకిస్థాన్‌పై పరోక్షంగా ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదాన్ని వ్యూహాత్మక సంపదగా ఉపయోగించరాదని స్పష్టం చేశారు. షెహబాజ్ షరీఫ్ సమావేశంలో ఉన్న సమయంలోనే మోదీ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

## అక్షర ఆంధ్రకు అద్భుత ఫలితాలు.. వచ్చే సెప్టెంబరుకు 100 శాతం అక్షరాస్యత:

రాష్ట్రంలో విద్యావ్యవస్థను బలోపేతం చేసి, సంపూర్ణ అక్షరాస్యత సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. 'అక్షర ఆంధ్ర' కార్యక్రమం ఉద్యమంలా సాగుతోందని, దీని ద్వారా వచ్చే ఏడాది సెప్టెంబర్ నాటికి రాష్ట్రాన్ని వంద శాతం అక్షరాస్యత సాధించిన రాష్ట్రంగా నిలపాలని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఉండవల్లిలోని తన నివాసంలో మంగళవారం పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్య శాఖల ఉన్నతాధికారులతో మంత్రి నారా లోకేశ్ సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా విద్యావ్యవస్థలో చేపడుతున్న సంస్కరణలు, కార్యక్రమాల పురోగతిని ఆయన సమీక్షించారు.

ఈ సమావేశంలో మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ... 2024 నాటికి రాష్ట్ర అక్షరాస్యత శాతం కేవలం 72.6 శాతంతో దేశంలోనే అట్టడుగున ఉందని, అయితే గత ఏడాదిగా కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలతో కేవలం ఒక్క ఏడాదిలోనే 25 లక్షల మంది నిరక్షరాస్యులు అక్షరాస్యులుగా మారారని తెలిపారు. ఈ కృషిని కేంద్ర ప్రభుత్వం కూడా అభినందించిందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకురాగా, ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల కేంద్రం విడుదల చేసిన వయోజన విద్య పరీక్షా ఫలితాల్లో రాష్ట్ర అక్షరాస్యత శాతం 10 శాతం పెరిగి 82.1 శాతానికి చేరుకుందని, ఇదే స్ఫూర్తితో 2027 సెప్టెంబర్ నాటికి సంపూర్ణ అక్షరాస్యత సాధించాలని కోరారు. ఇందుకు అనుగుణంగా 2027 మార్చి నాటికి మరో 25 లక్షల మందిని, ఆపై సెప్టెంబర్ నాటికి మిగిలిన 27 లక్షల మందిని అక్షరాస్యులుగా మార్చేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు అధికారులు వివరించారు. 11 ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని తెలిపారు. ఈ బృహత్ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేసి, ప్రజల్లో విస్తృత చైతన్యం తీసుకురావాలని మంత్రి నారా లోకేశ్ సూచించారు.

**బడిబయట పిల్లలందరినీ బడిలో చేర్పించాలి**

పాఠశాల విద్యపై సమీక్షిస్తూ, రాష్ట్రంలో బడిబయట ఉన్న 1,64,821 మంది పిల్లలను గుర్తించి, వారందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. ఈ ఏడాది ఇప్పటికే 33 వేల మందిని పాఠశాలల్లో చేర్పించామని, మిగిలిన వారి వివరాలను 'లీప్' యాప్ ద్వారా ప్రధానోపాధ్యాయులకు పంపామని పాఠశాల విద్య డైరెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. పిల్లలను బడికి పంపేలా తల్లిదండ్రులను చైతన్యవంతం చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో ఉపాధ్యాయుల హాజరు శాతం 98.97 శాతంగా ఉండటంపై సంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి, విద్యార్థుల హాజరు శాతాన్ని కూడా పెంచాలని సూచించారు. వరుసగా మూడు రోజులు బడికి రాని విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాలకు పిలిపించి కౌన్సిలింగ్ ఇవ్వాలని, ఈ బాధ్యతను పాఠశాల యాజమాన్య కమిటీలకు అప్పగించాలని స్పష్టం చేశారు.

**ఇంటర్ విద్యలో పురోగతి**

ఈ ఏడాది ఇంటర్మీడియట్ రెండో సంవత్సరంలో మంచి ఉత్తీర్ణత సాధించామని, గత ఏడాదితో పోలిస్తే సుమారు 10 వేల అడ్మిషన్లు పెరిగాయని ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ రంజిత్ బాషా తెలిపారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల కోసం 'సంకల్ప్ అకడమిక్ సపోర్ట్ ప్రోగ్రామ్' కింద ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు రూట్ మ్యాప్ సిద్ధం చేశామన్నారు. 'తల్లికి వందనం' పథకం ద్వారా ఈ ఏడాది ఇంటర్ విద్యార్థులకు రూ.1051 కోట్లు అందించామని, మొదటి సంవత్సరం విద్యార్థులకు కూడా త్వరలో అందిస్తామని చెప్పారు. ఇంటర్ విద్యార్థులకు సంబంధించి నూరుశాతం అపార్ ఐడీ ఇంటిగ్రేషన్ పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.

**మధ్యాహ్న భోజనం నాణ్యతపై రాజీ లేదు**

మధ్యాహ్న భోజనం పథకం నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడేది లేదని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. నాణ్యతపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు 'లీప్' యాప్ ద్వారా ఎప్పటికప్పుడు ఫీడ్‌బ్యాక్ అందించాలని కోరారు. అలాగే, విద్యార్థుల్లో ఒత్తిడి లేని అభ్యసన వాతావరణాన్ని కల్పించడంపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని సూచించారు. ఉపాధ్యాయులకు ఏఐ టూల్స్‌పై శిక్షణ ఇచ్చేందుకు 'ఏఐ సమర్థ్' కార్యక్రమం చేపడుతున్నామని, ఈనెల 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా 192 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తామని అధికారులు తెలిపారు.

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు స్పెషల్ టెట్ నిర్వహణ, పదో తరగతి విద్యార్థుల కోసం 'మిషన్ మార్చి-2026'పై కూడా సమావేశంలో చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా 125 కేంద్రాల్లో ఆటిజం సెంటర్లు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి శ్యామలరావు, సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి. శ్రీనివాసరావు, పాఠశాల విద్య మౌలిక సదుపాయాల సంస్థ ఎండీ దీవెన్ రెడ్డి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 1,000 దాటిన మరణాలు.. 700 మృతదేహాలు సామూహిక ఖననం

- మొదటి పేజి తరువాయి
వీరిలో 583 మంది విదేశీయులు, 83 మంది భద్రతా సిబ్బంది ఉన్నారు. ఇప్పటివరకు 12 వేల మందిని భద్రతా దళాలు రక్షించినట్లు అధికారులు వెల్లడించారు. మరోవైపు, టిబెట్‌లో 16 మంది ప్రాణాలు కోల్పోగా.. 550 మంది ఆచూకీ లభించలేదని చైనా మీడియా పేర్కొంది.

**700 మృతదేహాలు ఖననం..**

ఆయా ప్రాంతాల్లో వెలికితీసిన మృతదేహాలను దేశవ్యాప్తంగా 21 ఆసుపత్రులకు తరలిస్తున్నారు. గల్లంతైన వారి ఫొటోలు పట్టుకొని బాధిత కుటుంబాలు వైద్య కేంద్రాల వద్ద వేచిచూస్తున్నాయి. మృతదేహాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో వాటిని భద్రపరిచేందుకు ఏర్పాట్లు లేక ఇబ్బందికర పరిస్థితి నెలకొంది. అయితే, అవి గుర్తించలేని స్థితిలో ఉండటం, ఒక్కోచోట కొన్ని శరీర భాగాలు మాత్రమే లభ్యం అవుతుండడంతో అవి ఎవరివనేది నిర్ధరించడం సవాలుగా మారుతోంది. ఇప్పటివరకు వెలికితీసిన మృతదేహాల్లో 60 మాత్రమే సంబంధిత కుటుంబాలకు అందజేయగా.. దాదాపు 700 మృతదేహాల నమూనాలను భద్రపరచిన అనంతరం వాటిని సామూహికంగా ఖననం చేశారు.

**ఆరు రోజుల్లో 100 రెస్క్యూ మిషన్లు.. ఎవరీ ప్రియా అధికారి?**

**రెస్క్యూలో వేలాది మంది..**

ప్రస్తుతం నేపాల్‌లోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండగా నదుల్లో నీటి మట్టం పెరుగుతోంది. మరిన్ని వరదలు సంభవించవచ్చనే హెచ్చరికలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభావిత ప్రాంతాల్లో దాదాపు 21వేల మంది భద్రతా సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్‌లో నిమగ్నమయ్యారు. హెలికాప్టర్ల సాయంతో బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడం.. రోడ్లు, వంతెనలు కూలిపోయిన ప్రాంతాల్లోని ప్రజలకు ఆహారం సరఫరా తదితర కార్యక్రమాలు చేపట్టారు.

# విబిజి రాంజీ పథకంలో ఉపాధి శ్రామికులకు 125 రోజులు ఉపాధి



**అంబాజీపేట, పెన్ పవర్, సెప్టెంబరు 01:** విబిజి రాంజీ పథకంలో ఉపాధి శ్రామికులకు 125 పని దినాలు గా ప్రకటించిందని రైతులు కొబ్బరి తోటలలో అంతర పంటలకు సాగు ఎంతగానో ఉపయోగప డుతుందని డ్వామా పిడి జి ఎస్ రామ్ గోపాల్ అన్నారు. గంగలకుర్రు అగ్రహారం లో హార్టికల్చర్ ప్లాంటేషన్ సందర్శించినారు. కొబ్బరి తోటలో అంతర పంట లో భాగంగా మామిడి, బత్తాయి, జామ, కోకో, నిమ్మ, మునగ మొదలగు పంటలకు రైతులు వినియోగించుకోవాలని సూచించారు . విబిజి రాంజీ పథకంలో ఉపాధి శ్రామికులజు 100 నుండి 125 రోజులు పని దినాలు పెరగడం వలన అందరూ 125 రోజులు పని చేసుకోవాలని సూచించారు. అనంతరం తైవాన్ జామ పంటను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ ఏ వెంకటకృష్ణ, జెఈ పి వెంకటేశ్వరరావు, టిఏ లు పి ఉమా వరలక్ష్మి, ఎం. దేవి పార్వతి, ఫీల్డ్ అసిస్టెంట్లు వి. శ్రీనివాస్ ఐ.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# జిల్లా కలెక్టర్లకు రెడ్‌క్రాస్ అవార్డులు అందజేసిన గవర్నర్ అబ్దుల్ నజీర్



**విజయవాడ/కాకినాడ ,పెన్ పవర్,సెప్టెంబర్ 1:** మానవతా సేవా కార్యక్రమాలకు విశిష్ట సహకారం అందించిన వివిధ జిల్లాల కలెక్టర్లకు ఆంధ్రప్రదేశ్ గవర్నర్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ గౌరవ అధ్యక్షుడు ఎస్. అబ్దుల్ నజీర్ రెడ్‌క్రాస్ అవార్డులను అందజేశారు. మంగళవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్) 2024--25 వార్షిక సర్వసభ్య సమావేశంలో ఈ అవార్డుల ప్రదాన కార్యక్రమం జరిగింది. బాపట్ల, కృష్ణా, నెల్లూరు,కాకినాడ, పశ్చిమగోదావరి, నంద్యాల,శ్రీకాకుళం జిల్లాల కలెక్టర్లకు గవర్నర్ అవార్డులను అందజేసి అభినందించారు. రెడ్‌క్రాస్ చేపడుతున్న వివిధ మానవతా సేవా కార్యక్రమాలకు అవసరమైన వనరులను సమీకరించడంలో జిల్లా కలెక్టర్లు అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. అవార్డులు పొందిన ఇతర సంస్థలు, అధికారులు కూడా గవర్నర్ అభినందనలు తెలిపారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద వనరుల సమీకరణ, నిరుపేదలు, అవసరమైన వారికి ప్రయోజనం చేకూర్చే నిర్దిష్ట ప్రాజెక్టులకు నిధులు సమకూర్చడంలో వారు అందించిన సహకారాన్ని ప్రశంసించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ తలసేమియా బాధితులకు ఆరోగ్య సంరక్షణ అందించేందుకు రెడ్‌క్రాస్ చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. నిరుపేదలకు కృత్రిమ చేతులు అందించడం, కార్నియా సేకరణ, డ్రగ్స్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్ కోసం యువతలో అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమన్నారు. అల్లూరి సీతారామరాజు,పార్వతీపురం మన్యం, నంద్యాల,పల్నాడు,తిరుపతి,డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లాల్లో మూడేళ్లుగా రూ.8.50 కోట్లతో రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ సహకారంతో 'మీ ఇంటికి మీ డాక్టర్' పథకం ద్వారా సుమారు ఐదు లక్షల కుటుంబాలను దత్తత తీసుకుని రెడ్‌క్రాస్ అందిస్తున్న సేవలను గవర్నర్ ప్రశంసించారు. దేశ జనాభాలో మూడో వంతుకు పైగా యువత ఉన్న నేపథ్యంలో భారతదేశం స్వాతంత్ర్యం సాధించి 100 సంవత్సరాలు పూర్తిచేసుకునే నాటికి 'వికసిత్ భారత్', 'స్వర్ణ ఆంధ్ర ఏ2047' నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని గవర్నర్ పిలుపునిచ్చారు.

రాష్ట్రంలోని అన్ని కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో యూత్ రెడ్‌క్రాస్ యూనిట్లను ఏర్పాటు చేయాలని, విద్యా పాఠ్యాంశాల్లో రెడ్‌క్రాస్ అంశాలను అనుసంధానం చేయాలని ఆయన సూచించారు. యూత్ రెడ్‌క్రాస్ కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను ఆదర్శంగా నిలిపేందుకు జిల్లా కలెక్టర్లు సహకరించాలని కోరారు.

రెడ్‌క్రాస్ ప్రారంభించిన ఏపీ క్లైమేట్ యాక్షన్ క్యాంపెయిన్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వ్యతిరేక ప్రచారంలో రెడ్‌క్రాస్ వాలంటీర్లతో పాటు రాష్ట్ర ప్రజలు చురుగ్గా పాల్గొనాలని గవర్నర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఏపీ రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి, ముఖ్య కార్యనిర్వహణాధికారి అశ్విని కుమార్ పరిదా, చైర్మన్ పి.రామచంద్రరాజు, వైస్ చైర్మన్ డాక్టర్ డి. శ్రీహరిరావు, కోశాధికారి ఎం.డి.రామారావుతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## కాకినాడ కలెక్టర్‌కు ఇండియన్ రెడ్‌క్రాస్ గోల్డ్ మెడల్



**కాకినాడ, పెన్ పవర్,సెప్టెంబరు 1:** కాకినాడ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ప్రతిష్టాత్మక ఇండియన్ రెడ్‌క్రాస్ గోల్డ్ మెడల్ అవార్డును అందుకున్నారు. మంగళవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ వార్షిక సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర గవర్నర్, రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు ఎస్. అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని స్వీకరించారు. 2025--26 ఆర్థిక సంవత్సరంలో రెడ్‌క్రాస్ సభ్యత్వ నమోదు, విరాళాల సేకరణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను ఈ ప్రతిష్టాత్మక గోల్డ్ మెడల్‌కు ఎంపిక చేశారు. సమాజ సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించడంతోపాటు రెడ్‌క్రాస్ కార్యకలాపాల నిర్వహణలో విశేష కృషి చేసినందుకు గవర్నర్ ఈ సందర్భంగా కలెక్టర్‌ను అభినందించారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు ప్రతిష్టాత్మక గోల్డ్ మెడల్ లభించడంపై కాకినాడ జిల్లా ప్రజలు, అధికారులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## గ్రామాల్లో ఘనంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ





**కాజులూరు, పెన్ పవర్,సెప్టెంబరు 1:** మండల పరిధిలోని పలు గ్రామ సచివాలయాల పరిధిలో మంగళవారం ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో పింఛనుదారులకు ఇంటి వద్దకు వెళ్లి పింఛన్లు అందజేశారు. గొల్లపాలెం గ్రామ పంచాయతీ కార్యదర్శి సీహెచ్.సూర్య ప్రకాష్,సచివాలయ సిబ్బంది సమక్షంలో కూటమి నాయకులు అంగర కృష్ణ, గ్రామ కమిటీ అధ్యక్షుడు నక్కా శ్రీను, వడ్డి శ్రీనివాస్, శ్రీరాం మూర్తి తదితరులు పింఛనుదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. పింఛన్లు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా మంజేరు గ్రామంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదేశాల మేరకు ఏఎంసీ వైస్ చైర్మన్ దడాల నాగార్జున,పుణ్యమంతుల రామకృష్ణ చేతుల మీదుగా ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. మంజేరు సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు,కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ ప్రక్రియను సచివాలయ సిబ్బంది పర్యవేక్షించగా,అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సకాలంలో పింఛను అందేలా చర్యలు చేపట్టారు.

# పింఛన్‌దారులకు ప్రతి నెలా పండగే



**కాకినాడ, పెన్ పవర్,సెప్టెంబరు 1:** పండగలు ఏడాదికి ఒకసారి వస్తే పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన పింఛన్‌దారుల ఇళ్లలో ప్రతి నెలా పింఛన్ అందే రోజు పండగ వాతావరణం నెలకొంటోందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. మంగళవారం కాకినాడ నగరంలోని 38వ డివిజన్‌లో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఇన్‌చార్జి కమిషనర్ సత్యనారాయణతో కలిసి ఆయన పాల్గొని, లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ అర్హులైన ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తోందన్నారు. పింఛన్ పంపిణీలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటూ, లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు అందించే విధానాన్ని ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. సంక్రాంతి, క్రిస్మస్, రంజాన్ వంటి పండగలు ఏడాదికి ఒకసారి వస్తాయని, అయితే కూటమి ప్రభుత్వంలో పేద కుటుంబాలకు ప్రతి నెలా పింఛన్ అందే రోజు ఒక పండగలా మారిందని కొండబాబు పేర్కొన్నారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, అనారోగ్యంతో ఉన్న వారు పింఛన్ కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఉదయం నుంచే వారి ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు అందజేస్తున్నామని చెప్పారు. కుటుంబంలో సంపాదించే వారు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు నెలనెలా అందుతున్న పింఛన్ ఎంతో ఆర్థిక భరోసాను కల్పిస్తోందన్నారు. కుటుంబ పోషణ, మందులు, ఇతర వ్యక్తిగత అవసరాలకు పింఛన్ మొత్తం ఉపయోగపడుతోందని తెలిపారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం అర్హులైన వర్గాలకు నిరంతరం అండగా నిలుస్తోందన్నారు. పింఛన్ తేదీ ఆదివారం వచ్చినా లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా ముందుగానే పింఛన్ అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే తెలిపారు. కొత్త పింఛన్ల కోసం అందిన దరఖాస్తులను ప్రభుత్వం పరిశీలిస్తోందని, అర్హత ఉన్న వారికి త్వరలోనే పింఛన్లు మంజూరు చేస్తామని చెప్పారు. సంక్షేమానికి పెద్దపీట వేస్తూ కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, డివిజన్ నాయకులు ఏవీడీ మెంటారావు, నానావరుపు సుబ్రహ్మణ్యం, పలివెల లక్ష్మి, అనకాపల్లి గణేష్, ఆకుల శ్రీనివాస్, దీప్తి, మజ్జి రాంబాబు, చీకట్ల సత్తిబాబు, కోట నాగలక్ష్మి, సీరం అప్పారావు, తామరపల్లి నాగేశ్వరరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం



**అంబాజీపేట, పెన్ పవర్, సెప్టెంబరు 01:** చిరుతపూడి గ్రామంలో కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాలు అభివృద్ధి సంక్షేమ ఇంటింటికి టిడిపి కార్యక్రమం టిడిపి గ్రామ శాఖ వార శ్రీనుబాబు ,104 బూత్ కన్వీనర్ పచ్చిపాల శ్రీనివాస్ కో కన్వర్ సరెళ్ళ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి ని ప్రజలకు కరపత్రాలు అందించి వివరించారు. నియోజవర్గ కో కన్వీనర్ దాసరి వీర వెంకట సత్యనారాయణ, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు, మండల పార్టీ అధ్యక్షులు గుడాల ఫణి, ప్రధాన కార్యదర్శి రవణం రాము, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నాగాబత్తుల వెంకట సుబ్బారావు, చిరుతపుడి సొసైటీ చైర్మన్ రంపం సత్యనారాయణ, నాయకులు అయ్యగారు సూరిబాబు, బొడ్డు రామారావు, కొప్పినీడి ఈశ్వరరావు, సానబోయిన నరేష్, బొడ్డు అప్పాజీ, సాన బోయిన అర్జున్ రావు, కట్టా రాజు, కట్టా రాంబాబు, కట్టా సూరిబాబు, సూరంపూడి సత్యనారాయణ, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# గంజాయి సమాచారం ఇస్తే బహుమతి






**కాకినాడ, పెన్ పవర్,సెప్టెంబరు 1:** గంజాయి అక్రమ రవాణా,విక్రయాలు, వినియోగానికి సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు అందించి మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ పిలుపునిచ్చారు. మంగళవారం కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో విద్యార్థులు, యువత, ప్రజలకు 'రైజ్ ఎగైనెస్ట్ గంజా' పేరుతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గంజాయి వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేయడంతోపాటు కుటుంబ, సామాజిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలనకు పోలీసులు, విద్యార్థులు,యువత, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా 'రైజ్ ఎగైనెస్ట్ గంజా' పోస్టర్‌ను విడుదల చేశారు. గంజాయికి సంబంధించిన సమాచారం అందించే వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని ఎస్పీ తెలిపారు. విలువైన సమాచారం అందించిన వారికి తగిన బహుమతి అందజేస్తామని చెప్పారు. గంజాయికి సంబంధించిన సమాచారం కోసం 1972, అత్యవసర పోలీసు సేవల కోసం 112, కాకినాడ పోలీసు వాట్సాప్ నంబర్ 9494933233కు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు,స్థానిక ప్రజలు,పోలీసు అధికారులు గంజాయి,ఇతర మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని, వాటి నిర్మూలనకు తమ వంతు సహకారం అందిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) డాక్టర్ మహంతి కిషోర్ కుమార్,వివిధ పోలీసు స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు,ఎస్సైలు, పోలీసు సిబ్బంది, వివిధ కళాశాలలకు చెందిన సుమారు 1,200 మంది విద్యార్థులు,స్థానిక ప్రజలు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## గండేపల్లి పీహెచ్‌సీలో డీఎండహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీ

వైద్య సేవలు, మందుల నిల్వలు, పరిశుభ్రతపై సమగ్ర పరిశీలన





**గండేపల్లి, పెన్ పవర్, సెప్టెంబరు 1:** గండేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కాకినాడ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ అనిత మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది అందుబాటు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు.

పీహెచ్‌సీలో ఓపీ, ప్రయోగశాల, ఫార్మసీ సేవలను తనిఖీ చేశారు. ప్రయోగశాలలో అన్ని రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారా? రికార్డులు సక్రమంగా ఉన్నాయా? అనే అంశాలను పరిశీలించారు. ఫార్మసీలో మందుల నిల్వలు, వాటి గడువు తేదీలను తనిఖీ చేశారు. స్టాఫ్‌నర్సుల సేవలు, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, కోల్డ్‌చైన్ వ్యవస్థ, ప్రసవ గది పరిశుభ్రతను పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రతపై కూడా ఆరా తీశారు. చికిత్స కోసం వచ్చిన రోగులను నేరుగా కలిసి ఆసుపత్రిలో అందుతున్న సేవలపై అభిప్రాయాలను తెలుసుకున్నారు.

అనంతరం పీహెచ్‌సీలో పనిచేస్తున్న సిబ్బంది సంఖ్య, ఖాళీల వివరాలు, పరిధిలోని జనాభా, సచివాలయాల సంఖ్య, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల సంఖ్య, వాటి పనితీరు, నిర్వహణ తీరును పరిశీలించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిపైనా సమీక్ష నిర్వహించారు. అన్ని విభాగాలను పరిశీలించిన అనంతరం సేవల నిర్వహణపై డీఎండహెచ్‌ఓ డాక్టర్ అనిత సంతృప్తి వ్యక్తం చేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

## పింఛన్ల పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే నెహ్రూ



**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 1:** జగ్గంపేట మండలం కాండ్రేగుల గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. జగ్గంపేట ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, టీటీడీ బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ప్రతి లబ్ధిదారుడిని ఆత్మీయంగా పలకరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాకే పేదలకు నిజమైన భరోసా దక్కిందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో పింఛన్ కోసం లబ్ధిదారులు నానా ఇబ్బందులు పడితే, కూటమి ప్రభుత్వం వచ్చాక 1వ తేదీ ఉదయాన్నే ఇంటి వద్దకే పింఛన్ అందిస్తున్నామని చెప్పారు. చంద్రబాబు నిర్ణయంతో రాష్ట్ర చరిత్రలోనే అత్యధికంగా పింఛన్లు పెంచి ఇస్తున్న ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, రామిశెట్టి చందర్రావు, యల్లపు దొరబాబు, ఎంపీడీవో చంద్రశేఖర్, డిప్యూటీ ఎండిఓ శ్రీనివాస్ రెడ్డి, సెక్రటరీ పాలాటి నూకరాజు, బుర్రి భీమరాజు, రామిశెట్టి పాపారావు, బోదిరెడ్డి నాగార్జున, రామిశెట్టి విష్ణు చక్రబాబు తదితరులు పాల్గొన్నారు.ద

## రావులపాలెంలో ఘనంగా ఎల్ఐసీ 70వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**రావులపాలెం పెన్ పవర్ సెప్టెంబర్ 1** భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) 70వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను రావులపాలెం బ్రాంచ్ లో ఘనంగా నిర్వహించారు. ఎల్ఐసీ బ్రాంచ్ సీనియర్ మేనేజర్ బి.ఎన్. నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరిగింది. సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జ్యోతి ప్రజ్వలన చేసి, అనంతరం కేక్ కట్ చేశారు.ఈ సందర్భంగా సీనియర్ మేనేజర్ బి.ఎన్. నాయుడు మాట్లాడుతూ.. దేశ ప్రజల విశ్వాసాన్ని చూరగొంటూ ఏడు దశాబ్దాలుగా ఎల్ఐసీ సేవలు అందిస్తోందన్నారు. కోట్లాది కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పిస్తూ దేశ అభివృద్ధిలో సంస్థ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఎల్ఐసీ నిరంతరం కృషి చేస్తోందన్నారు.కార్యక్రమంలో అభివృద్ధి అధికారులు వి. శివప్రసాద్, జి. వెంకటేశ్వరరావు, పి. ప్రసాద్, పవన్, గంటా వెంకటేష్, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు గోపాలరావు, ప్రభాకర్, చైతన్యతో పాటు ఏజెంట్లు యడ్లపల్లి వెంకటేశ్వరరావు, చిర్ల వెంకటరెడ్డి, కంచర్ల సాంబమూర్తి, కె. నాగరాజు, కె. వరప్రసాద్, డి.ఆర్.కె. రాజు, కాళ్లకూరి సతీష్, పులిదిండి శ్రీనివాసరావు, తోట శివరామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని ఉద్యోగులు, ఏజెంట్లు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఒకరినొకరు అభినందించుకుని ఎల్ఐసీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

# టెక్నాలజీ.. సృజనాత్మకతల కలయిక ‘పోలీ వేద--2కె26

### పోలీ వేద - 2కె 26 పోస్టర్ విడుదల

**గండేపల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ 01:**గండేపల్లి మండలం, సూరంపాలెం లో గల ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాల యందు ఇంజనీర్స్ డే సందర్భంగా ఈనెల 11,12 తారీఖులలో "పోలీ వేద-2కె26' పేరిట టెక్ ఫెస్ట్ నిర్వహించడం జరుగుతుంది అని ఆదిత్య కళాశాల వైస్ చైర్మన్ డా.ఎన్.సతీష్ రెడ్డి తెలియజేసారు. ఈ సందర్భంగా డా. సతీష్ రెడ్డి మాట్లాడుతూ ఈ టెక్ ఫెస్ట్ కు సంబంధించిన క్యాంపెనింగ్ పోస్టర్ను రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్, వి.ఎస్.వి.సి.హెచ్. శ్రీనివాస ప్రసాద్ విడుదల చేసినట్లు తెలియజేస్తూ "వేద" కు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పోస్టర్ విడుదల చేసిన వి.ఎస్.వి.సి.హెచ్. శ్రీనివాస ప్రసాద్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులలో సృజనాత్మకతను వెలికి తీయడానికి ఆదిత్య చేస్తున్న కృషిని కొనియాడారు. పోస్టర్ రూపొందించిన ఎం. లీల సత్య ప్రవీణ్, (కంప్యూటర్ ఇంజనీరింగ్ విభాగం, మూడవ సంవత్సరం) ను అభినందించారు. ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా.ఎం. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల టెక్నికల్ నైపుణ్యాన్ని మెరుగు పరచడానికి మరియు నూతన ఆవిష్కరణలు ప్రోత్సహించడానికి "పోలీ వేద -2కె26" వేదిక అవుతుంది అని తెలియజేసారు. ఆదిత్య పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎస్.టి.వి.ఎస్. కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో, సాంకేతికత మరియు




సృజనాత్మకత మేళవింపుగా జరిగే ఈ కార్యక్రమంలో రాష్ట్రం మొత్తం మీద వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు తమ తమ టెక్నికల్ ప్రాజెక్ట్ లతో పోటీ పడతారు అని, గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రం కూడా అందజేయడం జరుగుతుంది అని తెలియజేసారు. ఈ సమావే శంలో డీన్ ఏ.వి. మాధవరావు, అసోసియేట్ డీన్ పొన్నాడ శ్రీనివాస్, వివిధ విభాగాలకు చెందిన విభాగాధిపతులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎన్టీఆర్ పెన్షన్ కార్యక్రమం



**సామర్లకోట మండల.. పనసపాడు.. పెన్ పవర్.. సెప్టెంబర్ .1.** పెద్దాపురం నియోజవర్గం శాసనసభ్యులు శ్రీ నిమ్మకాయల చినరాజప్ప ఆదేశాలు ప్రకారం...

పనసపాడు గ్రామంలో పేదల సేవలో కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్1 వ తేదీన పెన్షన్ పంపిణీ కార్యక్రమం ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ పలువురు కి కి పెన్షన్ అందజేసిన గ్రామ మాజీ సర్పంచ్ చీకట్ల వెంకటేష్

వెంకటేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ప్రతి పేదవాడికి పెన్షన్ అందజేయడం చాలా సంతోషంగా ఉందని

కూటమి ప్రభుత్వంలో ప్రతి ఒక్కరూ పెన్షన్ ఇవ్వడం జరుగుతుందని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో

బూత్ఇంచార్జీలు, సచివాలయం సిబ్బందితో పెన్షన్ పంపిణీ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ర్యాలి గ్రామంలో ఇంట్లో చోరీ.. 5 కాసుల బంగారం, రూ.10 వేల నగదు అపహరణ



**ఆత్రేయపురం పెన్ పవర్ సెప్టెంబర్ 1:** మండలంలోని ర్యాలి గ్రామంలో సోమవారం అర్ధరాత్రి ఇంట్లో చోరీ జరగడంతో స్థానికంగా కలకలం రేగింది. గ్రామానికి చెందిన పువ్వుల సత్యనారాయణ (తండ్రి: సత్యం) ఇంట్లో సోమవారం రాత్రి 11 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి బంగారు ఆభరణాలు, నగదును అపహరించినట్లు ఫిర్యాదు అందింది.

ఇంట్లోకి ప్రవేశించిన దుండగులు సుమారు 5 కాసుల బంగారు ఆభరణాలతో పాటు రూ.10 వేల నగదును అపహరించినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ఘటనపై సత్యనారాయణ మనవడు పువ్వల రామకృష్ణ ఆత్రేయపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. చోరీ జరిగిన ఇంటిని క్లూస్ టీమ్ పరిశీలించింది. క్లూస్ టీమ్‌కు సిబ్బంది ఎం. శ్రీనివాస్, ఏఎస్ఐ బి. శ్రీనివాస్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, అక్కడ లభించిన ఆధారాలను సేకరించారు.చోరీకి పాల్పడిన వ్యక్తులను గుర్తించేందుకు పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడయ్యే అవకాశం ఉంది.

## మంత్రి లోకేష్ ఆదేశాలతో రామూర్తి కుటుంబానికి రెండో పెన్షన్

రూ.15 వేల పెన్షన్ అందజేత.. వస్త్రాలు, పండ్లు అందించిన ఎమ్మెల్యే సతీమణి కమలారాణి





**కొత్తపేట,పెన్ పవర్,సెప్టెంబర్ 1:** కష్టాల్లో ఉన్న పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సతీమణి బండారు కమలారాణి అన్నారు. కొత్తపేట మండలం అవిడి గ్రామానికి చెందిన గోటేటి రామూర్తి కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విషయాన్ని సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న మంత్రి నారా లోకేష్ స్పందించి, కుటుంబానికి అండగా నిలిచారని తెలిపారు.

మంత్రి లోకేష్ ఆదేశాలు, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సూచనల మేరకు రామూర్తి కుటుంబానికి ఇప్పటికే 24 గంటల్లో విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేయడంతో పాటు ఇతర సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు చెప్పారు. మంత్రి ఇచ్చిన హామీ మేరకు రామూర్తి తల్లికి నెలకు రూ.15 వేల చొప్పున రెండో పెన్షన్‌ను కమలారాణి, డీఆర్డీఏ పీడీ, ఆర్డీఓల చేతుల మీదుగా మంగళవారం అందజేశారు.ఈ సందర్భంగా రామూర్తి కుటుంబాన్ని పరామర్శించిన కమలారాణి వారికి వస్త్రాలు, పండ్లు అందించారు. కుటుంబానికి ప్రభుత్వం, ఎమ్మెల్యే తరఫున అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.రామూర్తి కుటుంబానికి సొంత ఇల్లు నిర్మించి ఇస్తామని మంత్రి లోకేష్, ఎమ్మెల్యే సత్యానందరావు ఇచ్చిన హామీ మేరకు ఇంటి నిర్మాణ పనులు చేపట్టినట్లు కమలారాణి తెలిపారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి కుటుంబానికి ఇల్లు అందజేస్తామని చెప్పారు.

ప్రజల సమస్యలను సోషల్ మీడియా ద్వారా తెలుసుకుని వెంటనే స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్న మంత్రి నారా లోకేష్‌కు కొత్తపేట నియోజకవర్గ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. విద్యుత్ సౌకర్యం, పెన్షన్, ఇల్లు వంటి సహాయాలను అందించడం ప్రజా సంక్షేమ పాలనకు నిదర్శనమని కమలారాణి పేర్కొన్నారు.

## డయాలసిస్ పేషెంట్లకు అండగా ఎన్టీఆర్ భరోసా



**ఆలమూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 01:** డయాలసిస్ పేషేంట్లకు అండగా ఎన్టీఆర్ భరోసా నిలుస్తుందని గ్రామంలోని పలువురు కూటమి నాయకులు కొనియాడారు. మండలంలోని జొన్నాడ గ్రామానికి చెందిన దవులూరి అప్పారావు గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్నారు. అర్హతను బట్టి పింఛను మంజూరి కావడంతో మంగళవారం పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో భాగంగా రూ.10 వేలు పేషెంట్ అప్పారావు చేతికి కూటమి నాయకులు అందజేసి, కూటమి ప్రభుత్వం తమ కుటుంబానికి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాడి శ్రీనివాస్ రెడ్డి (బట్టి శ్రీను),నామాల సూరిబాబు, అయినవిల్లి సత్తిబాబు గౌడ్, చింతలపూడి శ్రీనివాస్, మల్లిడి సూర్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

## ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతాలకు భక్తులు తరలిరండి: నల్లమిల్లి కృష్ణ బాబు.



**ఏలేశ్వరం, పెన్ పవర్, సెప్టెంబర్ 1:** అన్నవరం దేవస్థానంలో జరుగు ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలకు భక్తులు తరలి రావాలని సత్య దీక్ష ప్రచారకర్త నల్లబిల్లి కృష్ణ బాబు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని యర్రవరం, కొత్త యర్రవరం ఏలేశ్వరం లింగవరం కాలనీ కృష్ణ బాబు ప్రచారం మంగళవారం నిర్వహించారు. అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో ఈ ఓ నల్లశీ సూర్యచక్రధర్రావు, చైర్మన్ ఐ వి రోహిత్, పాలకమండలి ఆదేశాల మేరకు అన్నవరం దేవస్థానంలో సెప్టెంబర్ 4వ తారీఖు న శుక్రవారం ఉదయం7 గంటలకు ఉచిత సామాజిక వరలక్ష్మి దేవి వ్రతములు చేపట్టనున్నారని సత్యదీక్ష ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు తెలిపారు. అలాగే మండల పరిధిలోని లింగంపర్తి, బద్రవరం,పేరవరం, పెద్దనాపల్లి, తదితర గ్రామాలలో అన్నవరం దేవస్థానంలో చేపట్టే ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతాల కరపత్రాలను ఆయా గ్రామాలలో భక్తులకు అందించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ బాబు మాట్లాడుతూ దేవస్థానం మహిళా భక్తులకి ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా వరలక్ష్మి దేవి వ్రతం పూజ చేసుకునే అవకాశం అన్నవరం దేవస్థానం కల్పించిందని, భక్తులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలనికోరారు వ్రత పూజా సామగ్రి కొబ్బరికాయ,అరటిపళ్ళు,విడిపువ్వులు, భక్తులు తెచ్చుకోవాలని, మిగిలిన వరలక్ష్మి దేవి పూజ సామాన్లు దేవస్థానం వారు ఉచితంగా ఏర్పాటు చేస్తారని తెలిపారు, వ్రత పూజ అనంతరం సత్యనారాయణస్వామి వారిని అమ్మవారిని

శ్రీ శ్రీ సీతరామచంద్ర స్వామిని, వనదుర్గమ్మ తల్లిని దర్శించుకుని స్వామి అమ్మవారు ఆశీస్సులు పొందాలని, స్వామి వారి అన్నప్రసాదం స్వీకరించి తిరిగి వారివారి ప్రాంతాలకు వెళ్లాలని కృష్ణ బాబు ఆకాంక్షించారు.

# కొండపల్లిలో ఎమ్మెల్యే చొరవతో నూతన అంగన్వాడీ కేంద్రం ప్రారంభం.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, సెప్టెంబర్ 01:**

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం బురదకోట పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామం కొండపల్లిలో ధర్తి ఆభా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ పథకంలో భాగంగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ చొరవతో నూతనంగా మంజూరైన అంగన్వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు.సీడీపీఓ పద్మావతి,గ్రామ ప్రత్యేక అధికారి,ఎంఈఓ వి.రాజబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నిమ్మల అప్పారావు,ఐసీడీఎస్ సూపర్వైజర్లు ఎన్ వరలక్ష్మి,జి చక్రవేణి,అంగన్వాడీ సిబ్బంది,గ్రామస్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీడీపీఓ పద్మావతి మాట్లాడుతూ నూతన అంగన్వాడీ కేంద్రం ఏర్పాటుతో కొండపల్లి గ్రామంలోని చిన్నారులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు.బాల్యదశ నుంచే చిన్నారుల్లో విద్య, నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు పోషకాహారం,ఆరోగ్య



సంరక్షణ అందించడంలో అంగన్వాడీ కేంద్రాలు కీలకంగా పనిచేస్తాయని తెలిపారు.కేంద్రం ద్వారా చిన్నారులతో పాటు గర్భిణులు,బాలింతలకు అవసరమైన సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

# జలహారతికి జైకొట్టిన రైతాంగం





## మురారి--సోమవరం మధ్య వందల ట్రాక్టర్లతో భారీ ర్యాలీ

## రైతులతో కలిసి ట్రాక్టర్ నడిపిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

**పెన్ పవర్ ప్రతినిధి గండేపల్లి, సెప్టెంబర్ 01:** ఉత్తరాంధ్ర రైతుల సాగు, తాగునీటి అవసరాలను తీర్చేందుకు గోదావరి జలాలను అనకాపల్లి జిల్లా పాయకరావుపేట వరకు తరలించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేపడుతున్న జలహారతికి సంఘీభావంగా కాకినాడ జిల్లాలో రైతాంగం కదం తొక్కింది. పోలవరం ఎడమ కాలువ ఆయకట్టు రైతులు వందలాది ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించి తమ మద్దతును చాటుకున్నారు.

గండేపల్లి మండలం మురారి నుంచి కిర్లంపూడి మండలం సోమవరం వరకు భారీ ట్రాక్టర్ ర్యాలీ సాగింది. జగ్గంపేట ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, టీటీడీ బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ స్వయంగా ట్రాక్టర్ నడుపుతూ రైతులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీకి మార్గమధ్యంలో రోడ్డుకు ఇరువైపులా రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఘన స్వాగతం పలికారు.

పోలవరం ఎడమ కాలువతో ఉత్తరాంధ్రకు జలకళ

అనంతరం సోమవరం గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ.. రాబోయే రెండేళ్లలో తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని ముందుగానే అంచనా వేసిన విజనరీ నాయకుడు చంద్రబాబు అని అన్నారు. కరువు పరిస్థితులను ముందే గుర్తించి రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతోనే పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలను పోలవరం ఎడమ కాలువ మీదుగా పాయకరావుపేట వరకు తరలించే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు.

కష్టాన్ని అవకాశంగా మార్చే నాయకుడు చంద్రబాబు

చంద్రబాబు కష్టాలను సైతం అవకాశాలుగా మలిచే నాయకుడని నెహ్రూ అన్నారు. ఆయన ముందుచూపుతో రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి కొరత లేకుండా అనేక చర్యలు చేపడుతున్నారని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే ఉభయ గోదావరి జిల్లాలతో పాటు ఉత్తరాంధ్ర రైతుల జీవితాల్లో వెలుగులు నిండుతాయని పేర్కొన్నారు. భూగర్భ జలాలు పెరగడంతో వ్యవసాయంతో పాటు తాగునీటి సమస్యలు కూడా పరిష్కారమవుతాయని అన్నారు.

రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది

రైతు సంక్షేమమే రాష్ట్ర అభివృద్ధికి పునాది అని నమ్మే నాయకుడు చంద్రబాబు అని నెహ్రూ అన్నారు. 31 ఏళ్ల క్రితం ఇదే రోజున చంద్రబాబు తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారని, అదే స్ఫూర్తితో రైతుల సంక్షేమం కోసం ఈ సంఘీభావ ర్యాలీ నిర్వహించామని తెలిపారు. పోలవరం ఎడమ కాలువ ఆయకట్టు రైతుల తరఫున చంద్రబాబు చేపట్టిన జలహారతికి పూర్తి సంఘీభావం ప్రకటిస్తున్నట్లు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, బస్వా వీరబాబు, జంపన సీతారామచంద్ర వర్మ, పోతుల మోహనరావు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, కందుల చిట్టిబాబు, జాస్తి వసంత్, పైడిపాల సూరిబాబు, ఉంగరాల రాము, తోట రవి, తోట గాంధీ, కంటిపూడి సత్యనారాయణ, పిల్ల చంటిబాబు, కుంచె రాజా, చదరం చంటిబాబు, జంపన రవివర్మతో పాటు రాష్ట్ర, జిల్లా టీడీపీ నాయకులు, సొసైటీ చైర్మన్లు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.





## ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు




- **కాకినాడ రూరల్‌లో 'ఛలో పిఠాపురం' భారీ బైక్ ర్యాలీ..**
- **రామచంద్రపురంలోనూ జనసేన శ్రేణుల సన్నాహాలు**

**కాకినాడ, పెన్ పవర్,సెప్టెంబరు 1:** జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను సెప్టెంబరు 2న జనసేన శ్రేణులు ఘనంగా నిర్వహించేందుకు సిద్ధమయ్యాయి. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని కాకినాడ రూరల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే పంతం నానాజీ ఆధ్వర్యంలో 'ఛలో పిఠాపురం' పేరుతో భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు. అదే విధంగా రామచంద్రపురం నియోజకవర్గంలో జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించేందుకు పార్టీ యువత సన్నాహాలు చేపట్టింది.

కాకినాడ రూరల్ నియోజకవర్గంలో సెప్టెంబరు 2న ఉదయం 9 గంటలకు గుడారిగుంటలోని ఎమ్మెల్యే పంతం నానాజీ క్యాంపు కార్యాలయం నుంచి 'ఛలో పిఠాపురం' భారీ బైక్ ర్యాలీ ప్రారంభం కానుంది. ఈ ర్యాలీలో జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు, వీర మహిళలు, పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కార్యాలయం పిలుపునిచ్చింది.

పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని రామచంద్రపురం నియోజకవర్గంలోనూ జనసేన యువత భారీ ర్యాలీకి సన్నాహాలు ప్రారంభించింది. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

రామచంద్రపురంలో ప్రతిపాదించిన బైక్ ర్యాలీ జనసేన పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమై రామచంద్రపురం మెయిన్ రోడ్డు, ఆర్టోస్ ఫ్యాక్టరీ, తాళ్లపాలెం, జగన్నాయకులపాలెం, గున్నయతూము, గాంధీ బొమ్మ సెంటర్, మసీదు సెంటర్, భీమేశ్వర స్వామి ఆలయం, ద్రాక్షారామ సెంటర్ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు కొనసాగనుంది.


పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని రెండు నియోజకవర్గాల్లో జనసేన శ్రేణులు పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నాయి. ర్యాలీల్లో పాల్గొనే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించి శాంతియుతంగా కార్యక్రమాల్లో పాల్గొనాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

## సంక్షోభాలను సంక్షేమాలుగా మార్చిన మహానేత ముఖ్యమంత్రి చంద్రబాబు. -జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ





**కిర్లంపూడి,పెన్ పవర్, సెప్టెంబర్ 01:** సంక్షోభాలను సంక్షేమాలుగా మార్చిన మహానేత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను అందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు సంఘీభావంగా మురారి నుంచి సోమవరం వరకు దాదాపు 200 ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ స్వయంగా ట్రాక్టర్ నడుపుతూ ర్యాలీలో పాల్గొన్నారు. జగ్గంపేటలో రావులమ్మ అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ర్యాలీ సోమవరం చేరుకోగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఎల్‌నినో వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితుల ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి రైతులకు సాగునీరు అందించాలనే దూరదృష్టితో చంద్రబాబు పట్టిసీమ, పురుషోత్తపట్నం వంటి ప్రాజెక్టులను చేపట్టారని నెహ్రూ అన్నారు. ఆకలితో ఉన్నవాడికే అన్నం విలువ తెలిసినట్లే.. నీటి కష్టాలు ఎదుర్కొంటున్న గ్రామాలకే సాగునీటి విలువ తెలుస్తుందని పేర్కొన్నారు. పోలవరం ద్వారా నీరు లేని ప్రాంతాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తిస్థాయిలో ప్రారంభించేందుకు ఇంకా సమయం ఉన్నప్పటికీ ఇప్పుడే ఎందుకు తొందరపడుతున్నారని ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాలకు పనులతోనే సమాధానం చెబుతున్నారని అన్నారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి వరకు నీటిని అందించి భూగర్భ జలాలను పెంచేందుకు చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ఎలాంటి విపత్తులు ఎదురైనా వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనే నాయకత్వం చంద్రబాబుదేనని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలకు ఉపయోగపడేలా రూపుదిద్దుకున్న పోలవరం ప్రాజెక్టు రాష్ట్ర భవిష్యత్తుకు కీలకమని నెహ్రూ పేర్కొన్నారు. గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తీసుకువచ్చే కార్యక్రమానికి రైతులు, ప్రజలు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏలేరు ప్రాజెక్టు చైర్మన్ బస్వా వీరబాబు, ఎంపీపీ తోట రవి, టీడీపీ నాయకులు ఎస్ వి ఎస్ అప్పలరాజు, మంతెన రాజు, మారిశెట్టి భద్రం, నియోజకవర్గ అభివృద్ధి కమిటీ సభ్యుడు చదరం చంటిబాబు, తూము కుమార్, సొసైటీ చైర్మన్ లు కుర్ల చిన్నబాబు, తోట గాంధీ, కుంచే రాజా, కందుల చిట్టిబాబు, గుడాల రాంబాబు, కాళ్ళ వెంకటేష్, ఉంగరాల రాము, పాఠంశెట్టి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.




## నేడు ఏలేశ్వరం డిపో సాధారణ సర్వీసులు రద్దు: డిపో మేనేజర్.





**ఏలేశ్వరం, పెన్ పవర్, సెప్టెంబర్ 1:** నేడు(బుధవారం) ఏలేశ్వరం డిపో ఆర్టీసీ సాధారణ సర్వీసులను రద్దు పరిచినట్లు డిపో మేనేజర్ జి వి సత్యనారాయణ మంగళవారం వెల్లడించారు. అనకాపల్లి జిల్లా, పాయకరావుపేటలో బుధవారం జరగబోయే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి బహిరంగ సభకు ఆర్టిసి బస్సులు కేటాయించారు. ఈ కారణంగా ఏలేశ్వరం డిపో పరిధిలోని 25 సాధారణ బస్సు సర్వీసులను తాత్కాలికంగా రద్దు చేసి, అనకాపల్లి సభకు కేటాయించినట్లు డిపో మేనేజర్ తెలియజేశారు. కావున ఆర్టీసీ ప్రయాణికులు బుధవారం అత్యవసరమైతే తప్ప , తమ ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. అత్యవసరంగా ప్రయాణించే ప్రయాణికులు, ముందస్తుగా ప్రత్యామ్నాయ ప్రయాణ ఏర్పాటు చేసుకుని, ఆర్టీసీకి సహకరించవలసిందిగా కోరుతున్నానని ఆ ప్రకటనలో తెలియజేశారు.

## బాస్కెట్‌బాల్ పోటీల్లో ఆదిత్య విద్యార్థి ప్రతిభ




**కాకినాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 1:** స్థానిక లక్ష్మీనారాయణ నగర్‌లోని ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలలో బీబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కందుల రాజేష్ బాస్కెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకం సాధించాడు. ఇటీవల తిరుపతిలో నిర్వహించిన స్టేట్ బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో కాకినాడ క్రీడా సాధికార ప్రాంగణానికి చెందిన డీఎస్ఏ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి రూ.50 వేల నగదు బహుమతిని గెలుచుకుంది. ఈ జట్టులో సభ్యుడిగా పాల్గొన్న కందుల రాజేష్ చక్కటి ప్రతిభ కనబరిచాడు. ఈ సందర్భంగా రాజేష్‌ను ఆదిత్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ మహమ్మద్ షాహిద్దీన్ అభినందించారు. డాక్టర్ నాయుడు మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలకు కూడా ఆదిత్య డిగ్రీ కళాశాలలో అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో జరిగే పోటీల్లోనూ రాజేష్ మరింత ప్రతిభ కనబరిచి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. రాజేష్‌ను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి, డైరెక్టర్ డాక్టర్ నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, జె. గణేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి టి. తేజేశ్వరరావు, అధ్యాపకులు అభినందించారు.

# ప్రతి పింఛన్ లబ్ధిదారుడికి నిర్ణీత సమయంలోనే భరోసా పింఛన్





* నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు
* కలెక్టర్ కె. దినేష్ కుమార్

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ సెప్టెంబర్ 1:** ప్రతి నెలా ఒకటో తేదీన ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను లబ్ధిదారులకు సకాలంలో అందించేలా జిల్లావ్యాప్తంగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు.

మంగళవారం రంపచోడవరం మండలం బొర్నగూడెం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. వివిధ రకాల సామాజిక పింఛన్ల లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి వారి చేతుల మీదుగా పింఛన్ మొత్తాలను అందజేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి నెల ఒకటో తేదీన అన్ని రకాల సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు అందించేందుకు ఎక్కడికక్కడ సిబ్బందిని నియమించి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పోలవరం జిల్లాలోని ప్రతి మండలం, ప్రతి గ్రామంలో పింఛన్ లబ్ధిదారులకు నిర్ణీత సమయంలో పింఛన్లు అందేలా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు.

పింఛన్లు ప్రతినెలా సకాలంలో అందుతున్నాయా లేదా, రేషన్ బియ్యం క్రమం తప్పకుండా పంపిణీ జరుగుతోందా అనే విషయాలను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని పలు ఇళ్లను సందర్శించిన కలెక్టర్, చిన్నారులకు సకాలంలో టీకాలు వేయిస్తున్నారా లేదా అనే అంశంపై కూడా తల్లిదండ్రులను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఓ చిన్నారిని కలెక్టర్ ఎత్తుకుని ఆప్యాయంగా పలకరించారు.

గ్రామంలో అంగన్‌వాడీ భవనానికి, పాఠశాల భవనానికి మరమ్మతులు చేపట్టాలని, గ్రామంలో పూర్వం నుంచి నివసిస్తున్న అర్హులైన కుటుంబాలకు కొత్త గృహాలు మంజూరు చేయాలని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

సామాజిక పింఛన్ల పంపిణీలో ఎవరైనా అధికారులు లేదా సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ కె. దినేష్ కుమార్ హెచ్చరించారు.

కలెక్టర్ వెంట పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షేక్ మహమ్మద్ షరీఫ్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ దాసరి రత్నాకర్ రావు, తహసీల్దార్ సీహెచ్ బాలాజీ, ఎంపీడీవో ప్రసాద్, ఎంపీడీవో పరిపాలన అధికారి పి. జయంతి, పీఏవో ఎల్. రాంబాబు, గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆత్రేయపురం మండలం పేరవరం నుంచి రాజకీయ మార్పు మొదలైంది





* టీడీపీ--జనసేనకు భారీ షాక్.. వైఎస్సార్‌సీపీలోకి 250 మంది చేరిక
* మాజీ ఎంపీపీ, మాజీ సర్పంచ్ దంపతులు బెజవాడ హిమబిందు--సతీష్ కూడా వైఎస్సార్‌సీపీలో చేరిక
* పేర్ని నాని, చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో భారీ చేరికలు

**ఆత్రేయపురం పెన్ పవర్ సెప్టెంబర్ 1:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం పేరవరం గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి భారీ బలం చేకూరింది. మాజీ మంత్రి పేర్ని నాని ఆధ్వర్యంలో, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన సుమారు 250 మంది నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు.

ఈ సందర్భంగా ఆత్రేయపురం మండల మాజీ ఎంపీపీ, పేరవరం గ్రామ మాజీ సర్పంచ్ బెజవాడ హిమబిందు--సతీష్ దంపతులు వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకుని పార్టీలో చేరారు. వారితో పాటు గ్రామానికి చెందిన పలువురు నాయకులు, యువత, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పార్టీలో చేరడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

**జగన్ నాయకత్వంపై నమ్మకంతో చేరికలు**

వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులు మాట్లాడుతూ.. పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంపై ఉన్న నమ్మకంతోనే పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. ప్రజల కోసం పనిచేసే నాయకత్వానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు.

**పేరవరం నుంచే రాజకీయ సమాధానం ప్రారంభమైంది**

కూటమి ప్రభుత్వానికి పేరవరం నుంచే ప్రజల రాజకీయ సమాధానం ప్రారంభమైందని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకుండా రాజకీయ కక్షసాధింపులకు ప్రాధాన్యత ఇస్తున్నారనే అభిప్రాయం ప్రజల్లో ఏర్పడిందని విమర్శించారు. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ప్రజలు ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా వైఎస్సార్‌సీపీ వైపు చూస్తున్నారని తెలిపారు.

**సోషల్ మీడియా ప్రచారాలతో ప్రజల తీర్పును మార్చలేరు**

టీడీపీ, జనసేన నేతలు వైఎస్సార్‌సీపీ బలహీనపడుతోందని చేస్తున్న ప్రచారాలకు పేరవరం గ్రామంలో జరిగిన భారీ చేరికలే సమాధానమని చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. కేవలం సోషల్ మీడియాలో ప్రచారాలు చేయడం ద్వారా ప్రజల మనసులను మార్చలేరని, ప్రజల తీర్పే అంతిమమని పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పథకాలను ప్రజలు ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారని అన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, యువతకు అందిన ప్రయోజనాలను ప్రజలు మరచిపోలేదని తెలిపారు.

**అధికారం శాశ్వతం కాదు.. ప్రజల విశ్వాసమే శాశ్వతం**

అధికారం శాశ్వతం కాదని, ప్రజల విశ్వాసమే శాశ్వతమని చిర్ల జగ్గిరెడ్డి పేర్కొన్నారు. అధికార బలంతో వైఎస్సార్‌సీపీని అణగదొక్కాలని ఎవరైనా ప్రయత్నిస్తే ప్రజల అండతో పార్టీ మరింత బలంగా నిలబడుతుందని స్పష్టం చేశారు.

పేరవరం గ్రామంలో జరిగిన చేరికలు కేవలం ఒక కార్యక్రమం కాదని, రాబోయే రోజుల్లో కూటమి పార్టీలకు ఎదురయ్యే రాజకీయ పరిణామాలకు ఇది సంకేతమని అన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన ప్రతి ఒక్కరికి చిర్ల జగ్గిరెడ్డి స్వాగతం పలుకుతూ, పార్టీలో ప్రతి కార్యకర్తకు సముచిత గౌరవం ఉంటుందని హామీ ఇచ్చారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

**ఆత్రేయపురం మండలం మొత్తం చేరికల పరంపర?**

పేరవరం నుంచి ప్రారంభమైన ఈ చేరికల పరంపర రాబోయే రోజుల్లో ఆత్రేయపురం మండలం మొత్తం విస్తరించనుందని వైఎస్సార్‌సీపీ శ్రేణులు ధీమా వ్యక్తం చేశాయి. టీడీపీ--జనసేన కూటమికి రాజకీయంగా ఎదురుదెబ్బలు తప్పవని, ప్రజా మద్దతు ఎవరి వైపు ఉందో పేరవరం గ్రామంలో జరిగిన భారీ చేరికలు స్పష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు.





# వికలాంగులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుంది



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ ,సెప్టెంబర్ 1:** పోలవరం జిల్లాలోని వికలాంగులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారికి అందాల్సిన సంక్షేమ పథకాలను అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు.

మంగళవారం రంపచోడవరం మండలం ముసురుమిల్లి పంచాయతీ పరిధిలోని బొర్నగూడెం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా, చిన్నారులకు సకాలంలో టీకాలు వేయిస్తున్నారా లేదా అనే విషయాలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. బడిఈడు పిల్లలను పాఠశాలలకు, చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు క్రమం తప్పకుండా పంపిస్తున్నారా అని ముఖ్యంగా మహిళలను ఆరా తీశారు.

ఈ సందర్భంగా గ్రామానికి చెందిన వికలాంగురాలు పల్లాల వెంకటరమణకు ట్రైసైకిల్ మంజూరు చేయాలని ఆమె తల్లిదండ్రులు, గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన కలెక్టర్ కె. దినేష్ కుమార్, వెంకటరమణకు ట్రైసైకిల్ మంజూరు చేయడంతో పాటు తక్షణమే పంపిణీ చేయించారు.

కలెక్టర్ మాట్లాడుతూ పోలవరం జిల్లాలోని వికలాంగులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హతను బట్టి అన్ని సంక్షేమ పథకాలను అందజేస్తామని తెలిపారు. వికలాంగుల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

వెంటనే స్పందించి ట్రైసైకిల్ మంజూరు చేసి పంపిణీ చేయించిన కలెక్టర్ కె. దినేష్ కుమార్‌కు వికలాంగురాలు పల్లాల వెంకటరమణ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, ఎంపీడీవో కార్యాలయ ఏవో పి. జయంతి, వి. శేఖర్, గణపతి, రాజు, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు

* పింఛన్ డబ్బులకు ఎవరైనా లంచం అడిగితే ఇవ్వొద్దు
* జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 1:** రాష్ట్ర ప్రభుత్వం సామాజిక భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లు సకాలంలో అందేలా చర్యలు చేపట్టిందని పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్ తెలిపారు.

మంగళవారం రంపచోడవరం మండలంలోని పెద్దగెద్దాడ గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్వయంగా పింఛన్లను అందజేశారు.

వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితర పింఛన్ లబ్ధిదారులతో జాయింట్ కలెక్టర్ ఆప్యాయంగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే విషయంపై కూడా ఆరా తీశారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల మొదటి తేదీన ఇంటి వద్దకే పింఛన్ అందించే విధానాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. పింఛన్ల పంపిణీలో ఎలాంటి జాప్యం, ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

పింఛన్ లబ్ధిదారులు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ప్రతినెల రేషన్ సకాలంలో అందుతోందా లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు.

పింఛన్ డబ్బులకు ఎవరైనా లంచం అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వవద్దని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. పింఛన్ మొత్తాన్ని ఎవరైనా అక్రమంగా లేదా లంచంగా డిమాండ్ చేస్తే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ డబ్బులను వ్యక్తిగత ఖర్చులు, కుటుంబ పోషణ, ఇతర అవసరాల కోసం వినియోగించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు.

జాయింట్ కలెక్టర్ వెంట డిప్యూటీ ఎంపీడీవో హరిబాబు, ఏపీఎం మధు, వీఆర్వో యోసోబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసేవలోనే కూటమి ప్రభుత్వం ముందుకు

* సిరిపురంలో పింఛన్ల పంపిణీ చేసిన ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి
* "రెండేళ్ల నమ్మకం -- ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమం





**గంగవరం /మారేడుమిల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ 1:** కూటమి ప్రభుత్వం ఏర్పడి విజయవంతంగా రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని రంపచోడవరం శాసనసభ్యురాలు, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ మిరియాల శిరీషాదేవి తెలిపారు.

మంగళవారం మారేడుమిల్లి మండలం దొరచింతలపాలెం పంచాయతీ పరిధిలోని సిరిపురం గ్రామంలో ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమంతో పాటు "రెండేళ్ల నమ్మకం -- ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వయంగా పింఛన్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ మొత్తాలను అందజేశారు. అనంతరం "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. వారి సమస్యలు, సాధకబాధకాలను అడిగి తెలుసుకున్నారు.

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించిన ఎమ్మెల్యే, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ద్వారా న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మారేడుమిల్లి మండల అధ్యక్షుడు గురుకు కుమార్, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు మల్లా దుర్గాప్రసాద్, రాష్ట్ర నూర్‌బాషా కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సుభాని, క్లస్టర్ ఇన్‌చార్జి డాక్టర్ పల్లాల రాజకుమార్ రెడ్డి, ఐటీడీపీ రంపచోడవరం నియోజకవర్గ అధ్యక్షుడు పాము రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి కర్రీ సన్యాసిరెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి అందాల సూర్యనారాయణ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు బి.శెట్టి అప్పాజీ, సుండం ప్రకాష్‌రావు, కట్రం సోమరాజు, విండెల గోపి, మాజీ సర్పంచ్ వీరవల్లి జార్జిబాబు, మాజీ ఎంపీటీసీ కానెం విజయలక్ష్మి, మాదాసి తిరుపతిరావు, సుంద్రం అబ్బాయిదొర, కత్తుల బంగారు రెడ్డి, కత్తుల కర్రెడ్డి, కత్తుల శ్రీనివాసరెడ్డి, దూడ ప్రణీత్, గొర్లే నారాయణ తదితరులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# రోల్ మోడల్ నియోజకవర్గం మంగళగిరి

**గుంటూరు, సెప్టెంబర్ 1, పెన్ పవర్:** విద్యా, ఐటీ మంత్రి నారా లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గం రూపురేఖలు వేగంగా మారిపోతు న్నాయి. ప్రభుత్వ నిధులతో పాటు భారీగా కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులు, పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్షిప్ విధానాలను అనుసంధానిస్తూ వేల కోట్ల రూపాయలతో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నారు. చేనేత కార్మికుల కోసం ప్రత్యేక బిజినెస్ సెంటర్లు, స్వర్ణకారుల కోసం ప్రత్యేక హబ్, అత్యాధునిక మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు, మోడల్ రైతుబజార్లు, విశాలమైన రహదారుల నిర్మాణం వంటి ప్రాజెక్టులతో మంగళగిరిని ఒక రోల్ మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దే ప్రయత్నం జరుగుతోంది. ప్రజాప్రతినిధిగా తన నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవడం అభినందనీయమే అయినప్పటికీ, ఇదే తరహా ప్రాధాన్యత, నిధుల ప్రవాహం రాష్ట్రంలోని మిగిలిన 174 నియోజకవర్గాలకు ఎందుకు లభించడం లేదనే ప్రశ్న రాజకీయంగా, పాలనాపరంగా పెద్ద ఎత్తున వ్యక్తమవుతోంది.భారతీయ రాజకీయాల్లో ముఖ్యమంత్రులు, శక్తివంతమైన మంత్రులు, కీలక నేతలు ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గాలకు ఎక్కువ నిధులు తరలడం కొత్తేమీ కాదు. గతంలో కుప్పం, పులివెందుల, గజ్వేల్ వంటి నియోజకవర్గాల్లో జరిగిన అభివృద్ధి దీనికి నిదర్శనం. అయితే, ప్రభుత్వ అధికారిక బడ్జెట్ పరిమితంగా ఉన్నప్పుడు, ఒకే నియోజకవర్గానికి ప్రాధాన్యత పెరిగితే సహజంగానే ఇతర ప్రాంతాల్లో అభివృద్ధి మందగిస్తుందనే ఆందోళన స్థానిక శాసనసభ్యుల్లోనూ, ప్రజల్లోనూ వ్యక్తమవుతుంది. సమాన వికేంద్రీకరణ జరగకపోవడం వల్ల ప్రాంతీయ అసమానతలు పెరిగే ప్రమాదం ఉందిమంగళగిరిలో జరుగుతున్న అభివృద్ధికి కేవలం ప్రభుత్వ బడ్జెట్ ఒక్కటే కారణం కాదు. నారా లోకేష్ తనకున్న ఐటి మంత్రి హోదా, కార్పొరేట్ సంస్థలతో ఉన్న సాన్నిహిత్యాన్ని ఉపయోగించి భారీగా సిఎస్ఆర్ నిధులను, పెట్టుబడులను ఆకర్షించగలుగుతున్నారు. పీఫోర్ మోడల్ ద్వారా ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తూ ఉపాధి అవకాశాలను సృష్టిస్తున్నారు. అయితే, రాష్ట్రంలోని సాధారణ ఎమ్మెల్యేలకు లేదా మంత్రులకు ఇటువంటి కార్పొరేట్ నెట్‌వర్కింగ్ లేదా పెట్టుబడులను ఆకర్షించే అవకాశం లేకపోవడం వల్ల వారు కేవలం ప్రభుత్వ గ్రాంట్లపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఇది నియోజకవర్గాల మధ్య అభివృద్ధి వ్యత్యాసానికి ప్రధాన కారణమవుతోంది.2019 ఎన్నికల్లో మంగళగిరి నుంచి లోకేష్ ఓటమి పాలైనప్పటికీ, ఆ తర్వాత నియోజకవర్గంలోనే ఉంటూ సొంత నిధులతో అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించి 2024లో భారీ మెజారిటీతో విజయం సాధించారు. తన రాజకీయ భవిష్యత్తుకు, నాయకత్వ పటిమకు మంగళగిరిని ఒక షోకేస్ గా మార్చాలనేది ఆయన వ్యూహం. ఈ మోడల్ ద్వారా తాను కేవలం ప్రజాప్రతినిధిగా మాత్రమే కాకుండా అభివృద్ధి ప్రదాతనని నిరూపించుకోవాలని భావిస్తున్నారు. అయితే, ఇది అధికార పార్టీకి చెందిన ఇతర ఎమ్మెల్యేలపై ప్రజా ఒత్తిడిని పెంచుతోంది. మా ఎమ్మెల్యే కూడా లోకేష్ లాగా నిధులు ఎందుకు తేలేకపోతున్నారు అనే ప్రశ్న సాధారణ ప్రజల నుంచి వస్తోంది.మంగళగిరిలో అమలు చేస్తున్న సిఎస్ఆర్, పీఫోర్ , ఇన్నోవేటివ్ ఉపాధి నమూనాలు . అయితే, ఈ మోడల్ కేవలం ఒక్క నియోజకవర్గానికే పరిమితం కాకూడదు. రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక విధివిధానాన్ని రూపొందించి, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని నియోజకవర్గాలలో ప్రాధాన్యత ఆధారంగా జూ= నిధులను సమంగా పంపిణీ చేసే వ్యవస్థను తీసుకురావాలి. ప్రతి జిల్లాకు లేదా నియోజకవర్గానికి పెట్టుబడులను ఆకర్షించేలా స్థానిక ఎమ్మెల్యేలకు సాంకేతిక, పాలనాపరమైన మద్దతును ప్రభుత్వం అందించినప్పుడే మంగళగిరి అభివృద్ధి మోడల్ సక్సెస్ అయినట్లు అనుకోవచ్చు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

## గూగుల్ డేటాకు అంతా రెడీ

**విశాఖపట్టణం, సెప్టెంబర్ 1, పెన్ పవర్:** గూగుల్ భారత్‌లో తన స్మార్ట్‌ఫోన్, ఏఐ ప్రాజెక్టులను విస్తరిస్తోంది. మీడియా నివేదికల ప్రకారం, గూగుల్ భారత్‌లో తన ప్రధాన ఏఐ మౌలిక సదుపాయాల ప్రాజెక్టును వేగంగా విస్తరిస్తోంది. ఈ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో 1 గిగావాట్ ఏఐ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేస్తోంది. దీని నిర్మాణ పనులు చాలా వేగంగా జరుగుతున్నాయి. అంతేకాకుండా, ఈ ప్రాజెక్ట్ మొదటి దశలో ఉందని, రాబోయే 24 నుంచి 30 నెలల్లో ఇది పూర్తి అవుతుందని అంచనా వేస్తున్నారు.నివేదిక ప్రకారం, ఈ మొత్తం ప్రాజెక్టుకు ఏకకాలంలో బహుళ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుందని గూగుల్ అధికారి అలెగ్జాండర్ స్మిత్ పేర్కొన్నారు. ఈ సంస్థ ఏప్రిల్‌లో విశాఖపట్నంలో 1+ఔ ఏఐ డేటా సెంటర్ హబ్ నిర్మాణాన్ని ప్రారంభించింది. ఈ ప్రాజెక్టు మొదటి దశ 2028 నాటికి ప్రారంభం కావచ్చని ఇప్పుడు భావిస్తున్నారుఅంతేకాకుండా, ఈ మొత్తం ప్రాజెక్టును పూర్తిగా కార్యరూపం ఇవ్వడానికి ఐదు సంవత్సరాల వరకు పట్టవచ్చు. అంతేకాక, ఆ కంపెనీ 2025 నుంచి 2030 మధ్య దేశంలో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టాలని యోచిస్తోంది.గూగుల్‌కు, భారత్‌లో తన ఏఐ సేవలను బలోపేతం చేయడంలో ఈ ఏఐ హబ్ కీలక పాత్ర పోషించగలదు. అంతేకాకుండా, తమ ఏఐ హబ్, సేవలకు భారత్ ఒక ఆశాజనకమైన మార్కెట్ అని ఆ సంస్థ విశ్వసిస్తోంది. ఇది భారత్‌లోని ప్రజలకు అనేక అవకాశాలను కల్పించగలదు.మీ సమాచారం కోసం, గూగుల్ తన ఏఐ డేటా సెంటర్‌ను విస్తరించడమే కాకుండా, తన ఇంటర్నెట్ నెట్‌వర్క్‌ను మరింత మెరుగుపరచడానికి విశాఖపట్నంలో ఒక కొత్త సి-కేబుల్‌పై కూడా పనిచేస్తోంది. ఈ వేగవంతమైన ఇంటర్నెట్ నెట్‌వర్క్‌లు, ఆస్ట్రేలియా, సింగపూర్ వంటి ప్రధాన దేశాలకు కంపెనీ ఏఐ హబ్ నేరుగా కనెక్షన్‌లను ఏర్పాటు చేసుకోవడానికి వీలు కల్పిస్తాయనివేదికల ప్రకారం, విశాఖపట్నంలో నిర్మిస్తున్న ఏఐ డేటా సెంటర్ హబ్ పూర్తిగా గ్రీన్ ఎనర్జీతో పనిచేయనుంది. ఈ 1 గిగావాట్ డేటా సెంటర్ ఎయిర్-కూల్డ్ టెక్నాలజీపై ఆధారపడి ఉంటుంది. అంతేకాకుండా, సాధారణంగా డేటా సెంటర్లు చాలా నీటిని వినియోగిస్తాయి, కానీ గూగుల్ ఈ సెంటర్‌లో నీటిని నియంత్రిత పద్ధతిలో ఉపయోగించాలని యోచిస్తోంది. దేశ పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకుని కంపెనీ తన డేటా సెంటర్‌ను ప్రారంభించాలని యోచిస్తోందని ఇది స్పష్టంగా సూచిస్తుంది.

## నో మైనింగ్ జోన్ గా పంచదార్లకొండ

**విశాఖపట్టణం, సెప్టెంబర్ 1, పెన్ పవర్:** అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండల పరిధిలో ఉన్న చారిత్రాత్మక పుణ్యక్షేత్రం పంచదార్ల కొండలను నో మైనింగ్ జోన్‌గా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. గురువారం గనుల, భూగర్భ శాస్త్ర శాఖ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో పంచదార్ల కొండల పరిధిలో గతంలో మంజూరు చేసిన 2,153 హెక్టార్ల విస్తీర్ణంలోని గ్రావెల్ క్వారీ లీజును తక్షణమే రద్దు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. గనుల తవ్వకాల వల్ల పంచదార్ల ప్రాంత పర్యావరణ సమతుల్యత దెబ్బ తినడమే కాకుండా, శతాబ్దాల నాటి పురాతన దేవాలయం, స్థానిక సహజ జల వనరులు, పురావస్తు ప్రాధాన్యత కలిగిన కట్టడాలకు తీవ్రమైన ముప్పు పొంచి ఉందని పర్యావరణ ప్రేమికులు, స్థానికులు చేసిన ఫిర్యాదులతో ఈ నిర్ణయం తీసుకున్నారు. పలు ప్రభుత్వం శాఖల తనిఖీల రిపోర్ట్, ఆరో జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సిఫార్సుల మేరకు ప్రభుత్వం ఈ రద్దు నిర్ణయం తీసుకుంది. పంచదార్ల కొండల పరిధిలో మైనింగ్ కార్యకలాపాలకు గతంలో విజయ్ కుమార్ నాయుడు దాసమన్ని అనే వ్యక్తికి 2153 హెక్టార్ల విస్తీర్ణంలో గ్రావెల్ క్వారీ లీజును ప్రభుత్వం మంజూరు చేసింది. ఇది మే 14, 2036వరకు అమల్లో ఉండాలి. ఈ లీజుపై వచ్చిన విమర్శలు, వివిధ వర్గాల ఫిర్యాదు, ప్రభుత్వ వర్గాల నివేదికలను పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం లీజును రద్దు చేసింది. రాంబిల్లి మండలంలోని పంచదార్ల కేవలం సాధారణ కొండల ప్రాంతం కాదు. అది శతాబ్ధాల నాటి ఘనమైన సాంస్కృతిక, ఆధ్యాత్మిక చరిత్ర కలిగిన పుణ్యక్షేత్రం. ఇక్కడ వెలిసిన పురాతన ఆలయాలు, చారిత్రక శిల్పకళా సంపద ఆంధ్రప్రదేశ్ సంస్కృతికి నిదర్శనాలు. పంచదార్ల కొండల నుంచి వచ్చే సహజ సిద్ధమైన ప్రవాహాలు, నీటి ఊటలు ఇక్కడి ఆధ్యాత్మిక ప్రాధాన్యతను మరింత పెంచాయి. ఇక్కడ జరిగే మైనింగ్, పేలుళ్ల కారణంగా దేవాలయానికి ప్రమాదంగా మారిందని ఫిర్యాదులు వచ్చాయి. ఇది చారిత్రక వారసత్వ సంపదకు ముప్పుగా మారింది. అందుకే రిపోర్ట్స్ ఆధారంగా ఈ ప్రాంతాన్ని నో మైనింగ్ జోన్‌గా ప్రభుత్వం ప్రకటించింది. అన్నింటి కంటే ముఖ్యంగా పంచదార్ల కొండలు స్థానిక పరిసర ప్రాంతాలకు ప్రధాన భూగర్భ జల వనరుగా పనిచేస్తాయి. మైనింగ్ కారణంగా సహజ జల నిల్వ సామర్థ్యం దెబ్బతింది. ఇది భవిష్యత్‌లో మరింత నీటి ఎద్దడికి కారణం అవుతుందని గ్రహించిన ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పంచదార్ల కొండల్లో మైనింగ్ రాజకీయంగా కూడా దుమారం రేపింది. అక్కడ వైసీపీ ఆందోళన చేపట్టింది. అక్రమ మైనింగ్‌తో ప్రభుత్వం పెద్దలు దోచుకుంటున్నారని మండిపడ్డారు. రాజకీయ పోరాటం కూడా ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రభావితం చేసింది.

## అడ్డగోలుగా రేషన్ మాఫియా

**గుంటూరు, సెప్టెంబర్ 1, పెన్ పవర్:** గుంటూరు జిల్లాలో పేదలకు చెందాల్సిన రేషన్ బియ్యం అక్రమ రవాణా వ్యవహారం తీవ్ర కలకలం రేపుతోంది. రేషన్ డీలర్లను లక్ష్యంగా చేసుకుని 'బియ్యం మాఫియా' బెదిరింపులకు దిగుతుండటంతో డీలర్లు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. రేషన్ బియ్యాన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం కాకుండా, బ్లాక్ మార్కెట్ తరలించేందుకు తమకే అప్పగించాలంటూ కొంతమంది మాఫియా ముఠా నాయకులు డీలర్లపై తీవ్ర ఒత్తిడి తీసుకువస్తున్నారు. ఈ అక్రమాలకు సహకరించని రేషన్ డీలర్లపై భౌతిక దాడులు, ప్రాణాపాయ బెదిరింపులకు పాల్పడుతున్నారంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.ఈ అక్రమ దందా వెనుక తిరుమలశెట్టి అనిల్ అనే వ్యక్తి, అతని అనుచరులు ఉన్నారని గుంటూరు జిల్లా రేషన్ డీలర్ల సంఘం ప్రతినిధులు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. అనిల్ మరియు అతని గ్యాంగ్ నుంచి తమకు తీవ్ర ప్రాణహాని ఉందంటూ డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిందితుడైన అనిల్‌పై ఇప్పటికే జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో రేషన్ బియ్యం అక్రమ రవాణా, బెదిరింపులకు సంబంధించిన క్రిమినల్ కేసులు నమోదై ఉన్నాయని సంఘం నేతలు గుర్తు చేస్తున్నారు.గతంలో కూడా గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం వాహనాలను స్థానిక ఎమ్మెల్యే గల్లా మాధవి స్వయంగా పట్టుకుని అధికారులకు అప్పగించిన ఘటన జిల్లాలో సంచలనం సృష్టించింది. అయినప్పటికీ రేషన్ మాఫియా ఆగడాలు తగ్గకపోవడంతో, రేషన్ డీలర్ల సంఘం ప్రతినిధులు గుంటూరు జిల్లా ఎస్పీ (ఙ్రా) ని కలిసి వినతిపత్రం సమర్పించారు. క్షేత్రస్థాయిలో డీలర్లపై దాడులకు తెగబడుతున్న రౌడీ మూకలపై కఠిన చర్యలు తీసుకోవాలని, మాఫియాను పూర్తిగా కట్టడి చేసి డీలర్లకు తగిన పోలీస్ రక్షణ కల్పించాలని వారు ఎస్పీని కోరారు. పేదల బియ్యాన్ని దోచుకుంటూ, డీలర్లను భయభ్రాంతులకు గురిచేస్తున్న ఈ రేషన్ మాఫియా వెనుక ఉన్న పెద్దలెవరో తేల్చాలని గుంటూరు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# రాజకీయాల్లో మత చర్చ..

**విజయవాడ, సెప్టెంబర్ 1, పెన్ పవర్:** రాజకీయాల్లో మత విశ్వాసాలు, వ్యక్తిగత నమ్మకాలు, రాజకీయ ప్రయోజనాల చుట్టూ కొత్త చర్చ మొదలైంది. ప్రజాస్వామ్యంలో ప్రతి వ్యక్తికి తనకు నచ్చిన మతాన్ని ఆచరించే హక్కు ఉంది. అదే సమయంలో రాజకీయ నాయకులకు కూడా తమ వ్యక్తిగత విశ్వాసాలను పాటించే స్వేచ్ఛ ఉంటుంది. అయితే రాజకీయ అవసరాలకు అనుగుణంగా నమ్మకాలను మార్చుకున్నట్లు కనిపించడం, పదవులు లేదా రాజకీయ ప్రాధాన్యత కోసం ఒక వర్గానికి దగ్గరగా ఉండేందుకు మతపరమైన అంశాలను ఉపయోగించుకోవడం ఇప్పుడు విమర్శలకు కారణమవుతోంది.రాజకీయ పార్టీలు సాధారణంగా ఒక విధానం, సిద్ధాంతం, ప్రజా ప్రయోజనాల ఆధారంగా పనిచేస్తాయి. నాయకులు ఆ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వారి బాధ్యత. కానీ వ్యక్తిగత విశ్వాసాలు కూడా రాజకీయ అవకాశాలకు కొలమానంగా మారితే మాత్రం సమస్య తలెత్తుతుంది. ఒక నాయకుడు తనకు నచ్చిన విధంగా ప్రార్థన చేయడం లేదా ఏ మతపరమైన కార్యక్రమానికైనా వెళ్లడం తప్పు కాదు. అది పూర్తిగా వ్యక్తిగత విషయం. కానీ రాజకీయ ప్రయోజనం కోసం మాత్రమే అలాంటి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారనే భావన ప్రజల్లో ఏర్పడితే మాత్రం ఆ నాయకుడి నిజాయితీపై ప్రశ్నలు రావడం సహజం.ఇటీవల చోటుచేసుకుంటున్న కొన్ని పరిణామాలు, రాజకీయ నేతల వ్యాఖ్యలు ఈ చర్చకు మరింత బలం ఇస్తున్నాయి. పార్టీ అధినాయకత్వానికి దగ్గరవ్వడం, కీలక పదవులు పొందడం లేదా పార్టీలో తమ ప్రాధాన్యతను పెంచుకోవడం కోసం కొందరు నేతలు తమ వ్యక్తిగత విశ్వాసాలకు భిన్నంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి ఆరోపణలు నిజమా కాదా అనేది పక్కన పెడితే, రాజకీయాల్లో వ్యక్తిగత నిబద్ధత ఎంత ముఖ్యమనే ప్రశ్న మాత్రం ముందుకు వస్తోంది.ప్రజలు తమ ప్రతినిధులను కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే అంచనా వేయరు. వారి మాటలు, పనితీరు, వ్యక్తిగత వైఖరి, ప్రజా సమస్యలపై స్పందించే తీరు అన్నింటినీ గమనిస్తారు. ఒక నాయకుడు తన అభిప్రాయాలను పరిస్థితులకు అనుగుణంగా తరచూ మార్చుకుంటున్నాడనే భావన కలిగితే, అతనిపై ప్రజల్లో విశ్వాసం తగ్గే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా మతం వంటి సున్నితమైన అంశాలను రాజకీయ లబ్ధి కోసం ఉపయోగిస్తున్నారనే ఆరోపణలు వస్తే పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారుతుంది.మతాన్ని రాజకీయ ఆయుధంగా మార్చడం వల్ల సమాజంలో విభజన పెరిగే ప్రమాదం ఉంది. అదే సమయంలో ఏ నాయకుడి వ్యక్తిగత మత విశ్వాసాలపై తీర్పు చెప్పడం కూడా సరైన పద్ధతి కాదు. అసలు కొలమానం ప్రజా సేవ, మాటకు కట్టుబాటు, పారదర్శకత, ప్రజల సమస్యలపై నిబద్ధత కావాలి.పదవులు శాశ్వతం కావు. అధికారంలో ఉన్నప్పుడు లభించే గుర్తింపు కూడా ఎప్పటికీ కొనసాగదు. కానీ ప్రజల్లో ఏర్పడే విశ్వాసం మాత్రం నాయకుడి రాజకీయ ప్రయాణాన్ని నిర్ణయించగలదు. అందుకే రాజకీయ నాయకులు తమ వ్యక్తిగత నమ్మకాలను రాజకీయ లాభనష్టాలతో కలపకుండా, ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది. అవకాశవాదానికి బదులుగా సిద్ధాంతపరమైన స్థిరత్వం, వ్యక్తిగత నిజాయితీ, ప్రజాసేవే రాజకీయ నాయకుడి అసలైన బలంగా మారితేనే ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల నమ్మకం మరింత బలపడుతుంది.

# వైసీపీని ముంచుతున్న కోటరి

**విజయవాడ, సెప్టెంబర్ 1, పెన్ పవర్:** వైఎస్సార్‌సీపీలో గతంలో పనిచేసిన కీలక నేత, ఇప్పుడు చక్రం తిప్పుతున్న మరో నేత మధ్య నెలకొన్న విభేదాలు క్రమంగా బహిరంగ విమర్శలకు దారితీస్తున్నాయి. మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి, వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి మధ్య సాగుతున్న మాటల యుద్ధం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పార్టీ అధికారంలో ఉన్న సమయంలో కీలకంగా వ్యవహరించిన నేతలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం వైసీపీ అంతర్గత పరిస్థితిపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.విజయసాయిరెడ్డి విడుదల చేసిన బహిరంగ లేఖపై సజ్జల రామకృష్ణారెడ్డి స్పందించారు. జగన్ విజయసాయిరెడ్డిని ఎక్కువగా అభిమానించారని, గుర్తు చేశారు. తమను లక్ష్యంగా చేసుకుంటే తమ స్పందన కూడా గట్టిగానే ఉంటుందని హెచ్చరించారు. విజయసాయి ఆరోపణలను ఇకపై పట్టించుకోబోనని, పార్టీ నేతలు కూడా వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.తనపై కేసులు నమోదైన సమయంలో తాను రాజకీయాల్లో లేనని సజ్జల పేర్కొన్నారు. 2024 తర్వాత పలువురు వైసీపీ నేతలు లిక్కర్ కేసుల్లో అరెస్టయిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. విజయసాయిరెడ్డి మాత్రం ఎందుకు అరెస్టు కాలేదనే ప్రశ్నను ఆయన లేవనెత్తారు. విజయసాయి తనను తాను ఎక్కువగా



ఊహించుకుంటున్నారని విమర్శించారు.వైసీపీలో ఇప్పటికే నాయకత్వం, పార్టీ భవిష్యత్తుపై చర్చ జరుగుతున్న సమయంలో కీలక నేతల మధ్య బహిరంగ విమర్శలు పార్టీకి మరింత ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది. జగన్ చుట్టూ ఉండే నాయకత్వ వ్యవస్థపైనా గతంలో పలువురు నేతలు విమర్శలు చేసిన సందర్భాలున్నాయి. ఇప్పుడు విజయసాయి--సజ్జల వివాదం ఆ చర్చకు మరోసారి తెరతీసినట్లయింది.ఇద్దరు నేతల మధ్య విభేదాలు మరింత ముదరకముందే పార్టీ అధినేత వైఎస్ జగన్ జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వచ్చే ఏడాది నుంచి పాదయాత్ర చేపట్టనున్నట్లు జగన్ ప్రకటించిన నేపథ్యంలో, ముందుగా పార్టీలోని అంతర్గత విభేదాలను చక్కదిద్దుకోవడం కీలకంగా మారింది. పార్టీకి చెందిన కీలక నేతలే బహిరంగంగా పరస్పరం విమర్శలు చేసుకోవడం కార్యకర్తల్లోనూ, ప్రజల్లోనూ ప్రతికూల సంకేతాలు పంపే అవకాశం ఉంది. ఇప్పటికే పలువురు సీనియర్ నేతలు వైసీపీకి దూరమైన నేపథ్యంలో తాజా వివాదం పార్టీ బలహీనతకు సంకేతంగా మారకుండా జగన్ ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది. విజయసాయిరెడ్డి--సజ్జల మధ్య మాటల యుద్ధం ఇక్కడితో ఆగుతుందా? లేక మరింత ముదురుతుందా? దీనిపై వైసీపీ అధిష్ఠానం ఎలా స్పందిస్తుందనేది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# వంద నియోజకవర్గాల్లో నేతలు కావలెను

**తిరుపతి, సెప్టెంబర్ 1, పెన్ పవర్:** రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్ళవుతుంది. వైసీపీ అధికారం కోల్పోయి కూడా రెండున్నరేళ్ళయ్యింది. అయినా ఇప్పటికీ వైసీపీ కోలుకోలేదు. ఓటమికి కారణాలు అన్వేషించకుండా రకరకాల ఆరోపణలతో కాలం వెళ్ళబుచ్చుతుంది. ఓటమి తర్వాత కూడా అధినేత జగన్ లో మార్పు రాలేదని ఆ పార్టీ శ్రేణులు లోలోన కుమిలి పోతున్నారు. అధినాయకుడు పట్టించుకోడు, స్థానిక నాయకులు బయటకు రావడం లేదు. దీంతో వైసీపీ కార్యకర్తలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.అదే మాట చెబుతున్నాడు వైసీపీ ఆస్థాన ' సర్వే' యర్ ఆరా మస్తాన్. ఇటీవల విడుదలైన మూడ్ ఆఫ్ సర్వే నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడినట్లు ప్రచారం జరుగుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా సంస్థాగతంగా వైసీపీ బలహీనంగా వుందని చెప్పిన ఆయన మొత్తం 175 నియోజకవర్గాల్లోని 70 స్థానాల్లో సరైన ఇంచార్జిలు లేరని కేవలం 60 నియోజకవర్గాల్లో మాత్రమే సరైన అభ్యర్థులు వున్నారని కుండబద్దలు కొట్టారు. వారిలో చాలా మంది హైదరాబాద్ లో వ్యాపారాలు చేసుకుంటూ నియోజకవర్గానికి చుట్టపు చూపుగా వచ్చి పోతున్నారని తెలిపారపార్టీ నాయకత్వం నాయకులను, కార్యకర్తలను పట్టించుకోవడం లేదని కేడర్లో తీవ్ర అసంతృప్తి వుందని, కొంతమంది కార్యకర్తలు సొంత డబ్బులు ఖర్చు చేసి పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వివరించారు. పార్టీ అధినేత జగన్ పార్లమెంట్ స్థాయి కార్యకర్తలతోనైనా సమావేశాలు పెట్టి మాట్లాడితే బాగుంటుందని కొందరు పార్టీ నాయకులు కోరుకుంటున్నారని చెప్పారు. ఈ సమాచారం అధినేతకు చేరవేసే దారులు వెదుకుతున్నారని చెప్పినట్టు ప్రచారం జరుగుతుంది.ఇప్పటికే పార్టీ అధినేత జగన్ కు వున్న ఇమేజ్, చరిష్మా మీదనే పార్టీ నడుస్తుందని చెప్పిన ఆరా మస్తాన్ నాయకత్వ స్థాయిలో లోపాలు సరిదిద్దుకోకపోతే క్షేత్ర స్థాయిలో నష్టం జరుగుతుందని వివరించారు. పార్టీకి బలమైన లీడర్షిప్, కేడర్ చాలా అవసరమన్నారు. జగన్ ఒంటరి పోరాటం మీదనే ఆధారపడితే నష్టం తప్పదని హెచ్చరించారు.కూటమి ప్రభుత్వం మీద ప్రజల్లో అసంతృప్తి ఉన్నప్పటికీ అది వ్యతిరేకతగా మారలేదని విశ్లేషించారు. ఇంకా మూడేళ్ల సమయం వుందని, అప్పటి పరిస్థితిని ఇప్పుడే అంచనా వేయడం సరికాదన్నారు. సర్వేలు చూసి వైసీపీ కేడర్ సంబరాలు చేసుకుంటే తప్పులో కాలేసినట్టవుతుందని హెచ్చరించారు. కూటమికి నేతృత్వం వహిస్తున్న టీడీపీకి బలమైన కేడర్ వుందని, దాన్ని ఢీ కొట్టడం అంత ఈజీ కాదన్నారు. ఆరా మస్తాన్ చేసినట్లు చెబుతున్న ఈ వ్యాఖ్యలు ఏపీలో సంచలనం సృష్టిస్తున్నాయి. గత ఎన్నికల్లో ఆయన వైసీపీ గెలుస్తుందని సర్వే వెల్లడించిన సంగతి తెలిసిందే.

పెన్ పవర్

బుధవారం 2 సెప్టెంబర్ 2026

## 'చాలా నమ్మకంగా ఉన్నా'.. టీమిండియాలోకి రీఎంట్రీపై రుతురాజ్ గైక్వాడ్ ధీమా

- పరుగులు చేయడంపైనే దృష్టి ఉందన్న సీఎస్‌కే కెప్టెన్
- నిలకడగా రాణించి టీమిండియా అవకాశం కోసం ఎదురుచూస్తానని వెల్లడి
- రషీద్-సూర్యవంశీ పోరుపై పెద్దగా ఆలోచించలేదని వ్యాఖ్య
- ఇప్పుడు మ్యాచ్‌లు ఎక్కువగా చూడడం లేదని వెల్లడి
- దేశవాళీ సీజన్‌పై రుతురాజ్ పూర్తి ఫోకస్



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియాలోకి తిరిగి రావడంపై భారత బ్యాటర్, చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ పూర్తి విశ్వాసంతో ఉన్నాడు. దేశవాళీ క్రికెట్‌లో పరుగులు సాధిస్తూ తన స్థానాన్ని తిరిగి సంపాదించుకోవడంపైనే దృష్టి పెట్టినట్లు చెప్పాడు. అవకాశం వచ్చినప్పుడు సత్తా చాటేందుకు సిద్ధంగా ఉంటానని తెలిపాడు. టీమిండియాలోకి పునరాగమనంపై మంగళవారం కోయంబత్తూర్‌లో ఓ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా రుతురాజ్‌ను మీడియా ప్రశ్నించింది. దీనికి స్పందిస్తూ.. "చాలా నమ్మకంగా ఉన్నా. మళ్లీ వెళ్లి పరుగులు చేయడంపైనే దృష్టి. ఇన్నాళ్లూ పరుగులు సాధిస్తూనే ఉన్నా. ఇక నిలకడగా రాణిస్తూ అవకాశం కోసం ఎదురుచూడాలి" అని చెప్పాడు.

ప్రస్తుతం జాతీయ జట్టులో చోటు కోసం దేశవాళీ క్రికెట్‌లో రుతురాజ్ తనను తాను నిరూపించుకునే ప్రయత్నం చేస్తున్నాడు. తన బ్యాటింగ్‌పై నమ్మకం ఉందని స్పష్టం చేశాడు. దేశవాళీ సీజన్ మొదలుకానున్న నేపథ్యంలో రాబోయే టోర్నీలపై దృష్టి పెట్టినట్లు తెలిపాడు. ఇదిలా ఉంటే.. ఆఫ్ఘనిస్థాన్‌తో భారత్ తలపడనున్న నేపథ్యంలో రషీద్ ఖాన్, యువ భారత బ్యాటర్ సూర్యవంశీ మధ్య ఆసక్తికర పోరు ఉంటుందా? అని రుతురాజ్‌ను అడిగారు. అయితే ఈ పోరుపై తాను పెద్దగా ఆలోచించలేదని చెప్పాడు. "మీరు మీ దేశానికి మద్దతు ఇవ్వాలని కోరుకుంటారు.. నేనూ అంతే, నా దేశానికి మద్దతివ్వాలని కోరుకుంటాను" అని అన్నాడు.

జట్టులో లేనప్పుడు తాను మ్యాచ్‌లను ఎక్కువగా చూడనని తెలిపాడు. ప్రస్తుతం తన సాధనపైనే ఎక్కువగా దృష్టి పెట్టినట్లు రుతురాజ్ తెలిపాడు. ప్రాక్టీస్‌తో పాటు దేశవాళీ టోర్నీలు కూడా ఉండటంతో టీమిండియా మ్యాచ్‌లను రోజూ చూడటం సాధ్యం కావడం లేదన్నాడు.

దులీప్ ట్రోఫీ తర్వాత ఇరానీ కప్ జరగనుంది. ఆ తర్వాత రంజీ ట్రోఫీ, సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ టోర్నీలు ఉన్నాయి. ఈ టోర్నీల్లో రాణించి మరోసారి భారత జట్టులో చోటు దక్కించుకోవాలని రుతురాజ్ చూస్తున్నాడు.

# ఆఫ్ఘాన్ సిరీస్‌కు టీమిండియా ప్రకటన

## శ్రేయాస్‌కు కెప్టెన్సీ

## హార్దిక్‌కు చోటు దక్కలేదు

## వైభవ్ సూర్యవంశీకి అవకాశం



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆఫ్ఘనిస్తాన్‌తో జరగనున్న మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు బీసీసీఐ భారత జట్టును ప్రకటించింది. శ్రేయాస్ అయ్యర్‌కు కెప్టెన్సీ అప్పగించగా.. హైదరాబాద్ క్రికెటర్ తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాకు జట్టులో చోటు దక్కలేదని సమాచారం. 15 ఏళ్ల యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీకి తొలిసారి అవకాశం లభించింది. గత సిరీస్‌ల్లో పెద్దగా ఆకట్టుకోని సంజు శాంసన్‌కు మరోసారి అవకాశం ఇచ్చారు. ఇషాన్ కిషన్ కూడా జట్టులో ఉన్నాడు. శివమ్ దూబే, నితీష్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్ తదితరులు జట్టులో చోటు దక్కించుకున్నారు. భారత్-ఆఫ్ఘనిస్తాన్ మధ్య టీ20 సిరీస్ సెప్టెంబర్ 13 నుంచి ప్రారంభం కానుంది. మూడు మ్యాచ్‌లు సెప్టెంబర్ 13, 15, 17 తేదీల్లో ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరగనున్నాయి.

## నన్నే లైట్ తీసుకుంటారా.. ఇది నా స్టామినా! దులీప్ ట్రోఫీలో దుమ్ము రేపుతున్న షమీ



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియా క్రికెట్ లో ఎంత టాలెంట్ ఉన్నప్పటికీ.. ఆటగాళ్లను ఎందుకు పక్కన పెడతారో ఒప్పటికీ అర్థంకాని ప్రశ్నే. ఫామ్ లో ఉన్నప్పటికీ.. ప్రూవ్ చేసుకుంటున్నప్పటికీ.. నెగ్లెక్ట్ చేయాలనుకుంటే ఎంత మొత్తుకున్నా.. ఫ్యాన్స్ నుంచి ఎంత డిమాండ్ వచ్చినా లైట్ తీసుకుంటారు. అలా బలైన ఆటగాళ్లలో షమీ ఒకరు. టీమిండియా సెలెక్టర్లు, కోచ్ లు పక్కన పెట్టినప్పటికీ.. తన టాలెంట్ ఏంటో, సత్తా ఏంటో చాటుతున్నాడు. ప్రస్తుతం దులీప్ ట్రోఫీలో ఆడుతున్న మహమ్మద్ షమీ.. తన పేస్ బౌలింగ్ తో దుమ్ము దులుపుతున్నాడు. బెంగళూరులో జరుగుతున్న సెమీఫైనల్ 1, డే3 మ్యాచ్ లో.. ఈస్ట్ జోన్ తరపున ఆడుతున్న షమీ తన అద్భుతమైన పేస్ తో సెంట్రల్ జోన్ ను కోలుకోలేని దెబ్బ కొట్టాడు. దీంతో సెంట్రల్ జోన్ 8 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిపోయింది. ఈస్ట్ జోన్ తరపున షమీ కీలకమైన రెండు వికెట్లు పడగొట్టడంతో సెంట్రల్ జోన్ పతన ప్రారంభమైంది. ఆ తర్వాత మరో పేసర్ ముకేష్ కుమార్ నాలుగు వికెట్లు తీసుకోవడంతో మ్యాచ్ పై పట్టు సాధించారు.

ఫస్ట్ ఇన్నింగ్స్ లో సెంట్రల్ జోన్ 266 రన్స్ చేసింది. లోయర్ ఆర్డర్స్ సపోర్ట్ తో రింకూ సింగ్ 60 రన్స్ తో పోరాటం చేసి స్కోర్ లో కీలక పాత్ర పోషించాడు. ఇక ఈస్ట్ జోన్ నుంచి చిచ్చరపిడుగు వైభవ్ సూర్యవంశీ 81 బంతులలో 92 రన్స్ తో చెలరేగగా.. మరో ప్లేయర్ అభిమన్యు ఈశ్వరన్ 69 రన్స్ ఇద్దరూ కలిసి 161 రన్స్ భాగస్వామ్యం నెలకొల్పారు. దీంతో ఈస్ట్ జోన్ కూడా 266 రన్స్ చేయగలిగింది. సెంట్రల్ జోన్ నుంచి 4 వికెట్లు తీసుకుని హర్ష్? దుబే ఒక్కడే కొంత ప్రభావం చూపించాడు. ఇక సెకండ్ ఇన్నింగ్స్ లో షమీ, ముకేష్ కుమార్ దెబ్బకు 158 రన్స్ కే ఆలౌట్ అయ్యింది. దీంతో ఈస్ట్ జోన్ విజయం ఖాయం అని ఫ్యాన్స్ భావిస్తున్నారు.

# తెలుగు సినిమాకు రూ.4 కోట్లు డిమాండ్ చేసిన మ్యాడీ

మలయాళి ముద్దుగుమ్మ మమితా బైజు ఒక్కసారిగా టాప్ ఆఫ్ ది సౌత్ ఇండియన్ సినిమా ఇండస్ట్రీ అయింది. ఈమె నటిగా ఇండస్ట్రీలో అనడుగు పెట్టి దాదాపుగా పదేళ్లు అవుతుంది. అయితే గతంలో ఎప్పుడూ లేని విధంగా ఇప్పుడు వరుస సక్సెస్‌లను సొంతం చేసుకుంది. 2024లో వచ్చిన ప్రేమలు సినిమాతో తమిళ్, తెలుగు భాషల్లోనూ పాపులారిటీ సొంతం చేసుకున్న మమితా బైజు తాజాగా విశ్వనాథ్ అండ్ సన్స్ సినిమాతో స్టార్ హీరోయిన్స్ జాబితాలో చేరి పోయింది. అందంతో పాటు అభినయం కావాలంటే మమిత బైజును తమ సినిమాల్లో ఎంపిక చేసుకోవాలి అనుకునే స్థాయికి ఆమె చేరింది అంటే ఆమె నటన గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. విశ్వనాథ్ అండ్ సన్స్ సినిమాలో కొన్ని సీన్స్ లో ఏకంగా స్టార్ హీరో సూర్యను డామినేట్ చేసే విధంగా నటించింది అంటూ కొందరు రివ్యూల్లో రాసిన విషయం తెల్సిందే. అందుకే మమిత క్రేజ్ ఒక్కసారిగా పెరిగింది.





**మమిత బైజు వరుస హిట్స్...**

ఇన్నాళ్లు మలయాళ సినిమాలు మాత్రమే చేసిన మమిత బైజు గత ఏడాది కాలంగా పూర్తిగా తమిళ సినిమాలు మాత్రమే చేస్తూ వచ్చింది. ఎట్టకేలకు ఆమె ఒక మలయాళ సినిమాతోనూ వచ్చింది. 2026లో ఈమె నటించిన నాలుగు సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. అన్ని సినిమాల్లోనూ ఈమె పోషించిన పాత్రకు మంచి మార్కులు పడ్డాయి. సూపర్ స్టార్ విజయ్‌తో కలిసి నటించిన జన నాయగన్ ఫలితం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఒరిజినల్ వర్షన్ లో శ్రీలీల పోషించిన పాత్రలో మమిత బైజు నటించిన విషయం తెల్సిందే. శ్రీలీల కంటే చాలా బెటర్‌గా మమిత బైజు నటించిందని, యాక్షన్ సీన్స్‌లోనూ వావ్ అనిపించింది అంటూ ప్రశంసలు కురిపించారు. ఇక విశ్వనాథ్ అండ్ సన్స్ సినిమాలోని మమిత బైజు నటన, చిలిపితనం, అందం ఇలా అన్ని విషయాలు పాజిటివ్ రెస్పాన్స్ దక్కించుకున్నాయి.

**కోలీవుడ్‌లో బ్యాక్ టు బ్యాక్ సినిమాలు...**

మలయాళ సినిమాలు ఈమె తక్కువ కమిట్ కావడానికి కారణం పారితోషికం అనే వార్తలు వస్తున్నాయి. తమిళ్, తెలుగు సినిమాల పారితోషికాలతో పోల్చితే మలయాళ సినిమాల పారితోషికాలు దాదాపు సగం, అంతకంటే తక్కువగా ఉంటాయి. అందుకే మలయాళ సినిమాలు వస్తున్నప్పటికీ పారితోషికం ఇష్యూ కారణంగా నో చెబుతుంది అంటూ అక్కడి స్థానిక మీడియా మమితపై విమర్శలు చేస్తూ రాస్తున్నారు. తమిళంలో ఈమె ఒక్క సినిమాకు మొన్నటి వరకు రెండు కోట్ల వరకు వసూలు చేసినట్లు తెలుస్తోంది. ఇప్పుడు విశ్వనాథ్ అండ్ సన్స్ సినిమా విజయంతో ఆ పారితోషికం ఏకంగా రూ.3 కోట్లకు పెరిగిందని తెలుస్తోంది. తమిళ్‌లో ఈమె ఇటీవల ఒక సినిమాకు సైన్ చేసిందని, అందుకు గాను రూ.3 కోట్ల పారితోషికం ఒప్పందం జరిగిందని తమిళ మీడియా కథనాలు వచ్చాయి. మమిత ఇప్పటి వరకు తెలుగు సినిమా సైన్ చేయలేదు.



**టాలీవుడ్ మూవీలో మమిత బైజు...**

ఒక స్టార్ హీరో సినిమాలో మమిత ను హీరోయిన్‌గా నటింపజేయడం కోసం సంప్రదించారని తెలుస్తోంది. మమిత అందుకు ఓకే చెప్పిందట, కానీ పారితోషికం గా రూ.4 కోట్లు కావాలంటూ డిమాండ్ చేసిందని తెలుస్తోంది. ఇప్పటి వరకు పారితోషికం విషయంలో తుది చర్చలు జరగలేదని, మమిత కాస్త తగ్గించుకుంటే నిర్మాతలు ఆమెకు అడ్వాన్స్ ఇస్తారని ఇండస్ట్రీ వర్గాల నుంచి సమాచారం అందుతోంది. టాలీవుడ్‌లో హీరోయిన్స్ కి భారీ పారితోషికం ఇవ్వడం ఈ మధ్య కాలంలో ఎక్కువగా జరుగుతుంది. కనుక తమిళ్ లో రూ.3 కోట్లకు ఓకే చెప్పిన మమిత, తనకు ఉన్న క్రేజ్, టాలీవుడ్ లో ఉన్న ఆనవాయితీ కారణంగా రూ.4 కోట్ల పారితోషికం డిమాండ్ చేసి ఉంటుందని అంటున్నారు. టాలీవుడ్‌లో సాలిడ్ హిట్‌తో ఎంట్రీ ఇస్తే మమితకు అంతకు మించిన పారితోషికం దక్కినా ఆశ్చర్యం లేదు. ఇంతకు మమిత ఏ హీరోతో టాలీవుడ్‌లో ఎంట్రీ ఇవ్వబోతుంది అనేది తెలియాలంటే కొన్ని రోజులు వెయిట్ చేయాల్సిందే.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com